జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి | సోమవారం 5 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 236 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## చకచకా అమరావతి

# పనులు



- రాజధాని నిర్మాణానికి కావాల్సిన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది
- కావాల్సిందల్లా రాజధాని నిర్మాణం..
- అదీ కేంద్రం సహకారంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని మోదీ స్పష్టంగా చెప్పకనే చెప్పారు.
- మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తేవడంతో అప్పటివరకున్న అమరావతి తెరమరుగైంది
- సీన్ కట్ చేస్తే ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరింది

**ప్రజాజ్యోతి విజయవాడ**

ఏపీ రాజధాని అమరావతి ప్రాధాన్యత, ప్రత్యేకత, నిర్మాణంపై సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కీలక వ్యాఖ్యలివి. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలతో ఏపీకి ఒక భరోసా, రాజధాని కల సాకారమైందన్న ఒక నమ్మకం కలిగినట్లు అయింది. రాజదాని అమరావతి నిర్మాణాన్ని మనం చెయ్యాలి? మనమే చెయ్యాలని మోదీ నొక్కిమరీ చెప్పారు. అంటే ఏపీలో ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పాడ్డాయి.కేంద్రంలో బీజేపీ సర్కార్ ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి పూచికపుల్లంతా అడ్డుకూడా రాదనేది మోదీ మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి కావాల్సిన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. కావాల్సిందల్లా రాజధాని నిర్మాణం..అదీ కేంద్రం సహకారంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని మోదీ స్పష్టంగా చెప్పకనే చెప్పారన్నారు.వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి అన్నట్లుగా?కేంద్రంలో మోదీ సర్కార్ ఉండడంతో ఇక రాజధాని అమరావతి నిర్మాణానికి ఎవరూ అడ్డుపడరని..ఏదీ అడ్డు రాదని?చక చకా రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మించుకోవాలని ఫుల్ పవర్స్ ఇచ్చేశారు ప్రధాని మోదీ. 2019 ఎన్నికల్లో జగన్ సీఎం కావడంతో అమరావతి నిర్మాణానికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తేవడంతో అప్పటివరకున్న అమరావతి తెరమరుగైంది.సీన్ కట్ చేస్తే ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో రాజధాని అమరావతిపై ఐదుకోట్ల ఆంధ్రుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. మరోసారి ప్రధాని మోదీ అమరావతి పునర్మిర్మాణ పనులను ప్రారంభించడంతో..ఐదు కోట్ల ఆంధ్రులు కన్న కలలు ఎట్టకేలకు సాకారం కాబోతున్నాయి. ఉమ్మడి ఏపీ విభజన తర్వాత ఇన్నాళ్లూ రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఏపీకి ఇప్పుడొక రాజధాని అనేది ఖరారైంది. దీంతో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి తిరిగి పురుడు పోసుకుంది. అనేక సవాళ్లు, పోరాటాల మధ్య అమరావతి పునరుజ్జీవం పొందింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర - మిగతా3లో

---

### జగన్ హెలికాప్టర్ ఘటన...


## 10 మంది వైసీపీ కార్యకర్తల అరెస్ట్

- గత నెల 9న పాపిరెడ్డిపల్లి వచ్చిన జగన్
- జగన్ హెలికాప్టర్ వద్దకు దూసుకువచ్చిన కార్యకర్తలు
- హెలికాప్టర్ ధ్వంసం!
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు పోలీసుల వెల్లడి



**ప్రజాజ్యోతి అమరావతి**

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ గత నెల శ్రీ సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న హెలికాప్టర్ ధ్వంసం ఘటనకు సంబంధించి 10 మంది వైసీపీ కార్యకర్తలను పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఒక స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధి కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసులు అరెస్ట్ చేసిన - మిగతా3లో



### 'అది నా బాధ్యత.. మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుంది'

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు
- భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతాం
- దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం నా బాధ్యత
- దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నా విధి.

### త్వరలోనే మిగిలిన నామినేటెడ్

# పదవుల భర్తీ

- మే 18 నాటికి రాష్ట్ర కమిటీలు మినహా అన్ని కమిటీల ఏర్పాటు పూర్తి
- కడపలో 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు మహానాడు
- మోదీ చేతుల మీదుగా అమరావతి పనుల పునఃప్రారంభానికి కారణం ఇదే: చంద్రబాబు
- టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- అమరావతి పునఃప్రారంభ కార్యక్రమ విజయంపై కార్యకర్తలకు అభినందనలు



**ప్రజాజ్యోతి అమరావతి**

మే 18 నాటికి రాష్ట్ర కమిటీలు మినహా అన్ని కమిటీల ఏర్పాటు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గంతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కడపలో 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన నామినేటెడ్ పదవులను త్వరలోనే భర్తీ చేస్తామని చంద్రబాబు చెప్పారు. రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమం విజయవంతం అవడంలో కార్యకర్తల కృషిని చంద్రబాబు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం - మిగతా3లో

---

# అకాల వర్షం.. అపార నష్టం

### ఆ జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ




**ప్రజాజ్యోతి అమరావతి**

ఏపీలోని పలు జిల్లాలను అకాల వర్షాలు ముంచెత్తాయి. అలాగే పిడుగుపాటు కారణంగా కొందరు మృత్యువాతపడ్డారు. మరోవైపు చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఏపీలో పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అదేవిధంగా రాగల 2-3 గంటల్లో ప్రకాశం, కృష్ణా, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే గంటకు 60-85 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు విపత్తు నిర్వహణ శాఖ ఎండీ రోనంకి కూర్మనాథ్‌తో హోం మంత్రి అనిత ఫోన్‌లో మాట్లాడి, తాజా పరిస్థితిపై ఆరాతీశారు. ప్రజలకు - మిగతా3లో

## మాకు కావాల్సింది భాగస్వాములు.. బోధకులు కాదు

- భారత విదేశాంగ మంత్రి ఎన్ జైశంకర్
- భారతదేశానికి భాగస్వాములు కావాలి.. అంతే కానీ బోధకులు అవసరం లేదు.
- 'మనం ప్రపంచాన్ని చూసినప్పుడు, భాగస్వాముల కోసం చూస్తాం
- ముఖ్యంగా కొన్ని విదేశాలు చాలా బోధనలు చేస్తారు
- కొన్ని యూరప్ దేశాలు ఇప్పటికీ ఈ సమస్యతో పోరాడుతున్నాయని నేను నమ్ముతున్నాను



# తీవ్ర అనారోగ్యంతో మూడేళ్ల బాలిక..
# జైన మతాచారం 'సంతార'తో మృతి

**భోపాల్:** మూడేళ్ల బాలికకు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. శస్త్రచికిత్సతో పాటు చికిత్సలు విఫలమయ్యాయి. దీంతో మరణం అనివార్యమని భావించిన ఆ బాలిక తల్లిదండ్రులు జైన మతాచారాన్ని పాటించారు. స్వచ్ఛంద ఆమరణ నిరాహార దీక్షగా పేర్కొనే 'సంతార' వల్ల ఆ చిన్నారి మరణించింది. మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. పియూష్, వర్ష జైన్ దంపతులు ఐటీ నిపుణులు. వారి మూడేళ్ల కుమార్తె వియానా జైన్‌కు గత ఏడాది డిసెంబర్‌లో బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లుగా వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఆ చిన్నారికి నిర్వహించిన సర్జరీ విఫలమైంది. కాగా, ఆ కుటుంబం ఆధ్యాత్మిక మార్గం వైపు మొగ్గు చూపింది. మార్చి 21న జైన సన్యాసి రాజేష్ ముని మహారాజ్‌ను వారు సందర్శించారు. తల్లిదండ్రులైన పియూష్, వర్ష జైన్ అనుమతితో వారి కుమార్తె వియానా జైన్‌తో 'సంతార' ప్రతిజ్ఞ చేయించారు. దీంతో స్వచ్ఛంద ఆమరణ నిరాహార దీక్ష పాటించిన కొన్ని నిమిషాలకు ఆ చిన్నారి మరణించింది. మరోవైపు 'జైన ఆచారం 'సంతార'ను ప్రతిజ్ఞ చేసిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా వియానాను 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తించింది. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన ఈ జైన మతాచారం మరోసారి చర్చకు దారి తీసింది. కేవలం మరణానికి దగ్గరగా ఉన్నప్పుడు లేదా బాగా వృద్ధప్యంలో ఉండి మతాచారాలు పాటించలేనప్పుడు, నయం కాని రోగంతో బాధపడుతున్నప్పుడు మాత్రమే 'సంతార'ను ఆచరించాలని జైన మత గ్రంథాలు చెబుతున్నాయి. కాగా,



జైన మతాచారం 'సంతార' చట్టపరమైన సవాళ్లను కూడా ఎదుర్కొన్నది. సంతారను చట్టవిరుద్ధంగా పరిగణించాలని, భారత శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 306 ప్రకారం ఆత్మహత్యతో సమానం చేయాలని 2015లో రాజస్థాన్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్వచ్ఛందంగా జీవితాన్ని ముగించాలన్న నిర్ణయం స్వీయ హాని అని ఆరోపించింది. దానిని మతపరమైన ఆచారంగా సమర్థించలేమని కోర్టు పేర్కొంది. మరోవైపు రాజస్థాన్ హైకోర్టు తీర్పుపై జైన సమాజం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో నెల తర్వాత ఈ తీర్పు ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిలిపివేసింది. మత స్వేచ్ఛ రక్షణ కింద సంతారాను జైనులు కొనసాగించడానికి సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది.

# తోకాడిస్తున్న పాకిస్తాన్..
# ఇగ్లా-ఎస్ మిస్సైల్స్‌ని సిద్ధం చేసిన భారత సైన్యం!

పహల్గాం తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. రోజురోజుకు పరిస్థితులు దిగజారుతున్నాయి. ఇప్పటికే సరిహద్దుల్లో పాకిస్తాన్ సైన్యం కవ్వింపులకు పాల్పడుతున్నది. ఈ క్రమంలోనే రష్యా నుంచి భారత్ ఇగ్లా-ఎస్ మిస్సైల్‌ని దిగుమతి చేసుకున్నది. అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు భారత్ ఈ స్మాల్‌రేంజ్ మిస్సైల్‌ను దిగుమతి చేసుకుంది. దాంతో భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత పటిష్టం కానుందని ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. సైన్యానికి ప్రభుత్వం ఇచ్చిన ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ పవర్స్‌ని ఉపయోగించుకొని వాటిని కొనుగోలు చేశారు. వాస్తవానికి ఈ మిస్సైల్స్ కొద్దిరోజుల కిందటే భారత్‌కు చేరుకోగా.. ప్రస్తుతం పాకిస్తాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సరిద్దులకు తరలిస్తున్నారు. ఈ మిస్సైల్స్ ఫైటర్ జెట్స్, ఛాపర్స్, డ్రోన్స్‌ని కూల్చొచ్చు. దాదాపు రూ.260 కోట్ల వ్యయంతో సైన్యం ఈ మిస్సైల్స్‌ని కొనుగోలు చేసింది. ఈ మిస్సైల్ పశ్చిమ సెక్టార్‌లో సరిహద్దుల్లో వాడేందుకు అనువుగా ఉండనున్నాయి. ఇవి ఇప్పటికే వాయుసేన అమ్ములపొదిలో ఉన్నాయి. ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కింద ఇటీవల కాలంలో ఆయుధాల విడిభాగాలు సైతం దిగుమతి చేసుకుంటున్నారు. దళాలను యుద్ధ సన్నద్ధతగా ఉంచేందుకు ఉపయోగపడుతున్నాయి. తాజాగా 48 లాంచర్లు, 90 ఇగ్లా-ఎస్ క్షిపణుల కోసం సైన్యం టెండర్ విడుదల చేసింది. వీటిని ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కిందే కొనుగోలు చేయనున్నారు. వీటితో పాటు తర్వాతి తరం ఇగ్లాలపై సైతం రక్షణశాఖ దృష్టి సారించింది. వీటికి లేజర్‌బీమ్ రైడింగ్ సామర్థ్యం ఉండడం విశేషం. 1990 నుంచి ఇగ్లా మిస్సైల్స్‌ని సైన్యం వినియోగిస్తున్నది. దేశీయంగా



ఉన్న సంస్థలు వీటిల్లో మార్పుతో ఇగ్లా-ఎస్ వెర్షన్ రెడీ చేశాయి. పాక్ సైన్యం పలు రకాల డ్రోన్లు, యూఏవీలు వినియోగిస్తున్న నేపథ్యంలో.. ఇగ్లా-ఎస్ మిస్సైల్ అవసరం భారత్‌కు ఎక్కువగా ఉండొచ్చని అంచనా. దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్‌కి చెందిన మార్క్-1ని సైన్యం మోహరించనున్నిది. ఇది ఎనిమిది కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం నుంచి డ్రోన్స్‌ని అడ్డుకునే సామర్థ్యం ఉంది. ఈ వ్యవస్థలో డ్రోన్‌లను కూల్చే లేజర్ టెక్నాలజీ ఉంది. ఇటీవల జమ్మూలో ఈ వ్యవస్థను ఉపయోగించి పాకిస్తాన్ సైన్యం డ్రోన్‌ను ఆర్మీ వైమానిక రక్షణ విభాగం కూల్చివేసింది.జ

# మాకు కావాల్సింది భాగస్వాములు.. బోధకులు కాదు

**న్యూఢిల్లీ:** యూరోపియన్ దేశాలపై భారత విదేశాంగ మంత్రి ఎన్ జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ దేశాలు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై ధ్వజమెత్తారు జైశంంకర్. యూరోపియన్ దేశాలు భారత భౌగోళిక రాజకీయ వైఖరిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయంటూ విమర్శలు చేశారు. భారతదేశానికి భాగస్వాములు కావాలని, అంతే కానీ బోధకులు అవసరం లేదని చురకలంటిచారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో జరిగిన ఆర్కిటిక్ సర్కిల్ ఇండియా ఫోరం సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐస్లాండ్ మాజీ అధ్యక్షుడు గ్రిమ్సన్ తదితరులతో జరిగిన చర్చావేదికలో యూరప్ తీరును జైశంకర్ బహిర్గతం చేశారు. యూరప్ దేశాల నుంచి భారత్ ఏం కోరుకుంటుదని అడిగిన ప్రశ్నలో భాగంగా జై శంకర్‌ఇలా సమాధానమిచ్చారు. 'మనం ప్రపంచాన్ని చూసినప్పుడు, భాగస్వాముల కోసం చూస్తాం. ముఖ్యంగా కొన్ని విదేశాలు చాలా బోధనలు చేస్తారు, వాటిని సొంత దేశంలో ఆచరించరు. కొన్ని యూరప్ దేశాలు ఇప్పటికీ ఈ సమస్యతో పోరాడుతున్నాయని నేను నమ్ముతున్నాను' అని అన్నారు. ఇప్పుడు యూరప్ దేశాలు వాస్తవిక వైపు అడుగులు వేయగలరా లేదా అనేది చూడాలి. మనం భాగస్వామ్యాన్ని చేసుకోవాలంటే, కొంత అవగాహన



ఉండాలి, కొంత సున్నితత్వం ఉండాలి, పరస్పర ప్రయోజనాల పట్ల అవగాహ ఉండాలి, ప్రపంచం ఎలా పనిచేస్తుందో గ్రహించాలి, ఈ విషయంలో కొన్ని యూరప్ దేశాలు సమర్థవంతంగా ఉండగా, మరికొన్ని వెనుకబడి ఉన్నాయన్నారు. గతంలో కూడా యూరప్ దేశాల తీరుపై జైశంకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి సమస్యల్ని ప్రపంచ సమస్యలుగా చూపిస్తారని, ప్రపంచ సమస్యల్ని మాత్రం వారు పట్టించుకోరంటూ వ్యాఖ్యలు చేశారు.

## రోడ్డుపై వెళ్తున్న కారు పేలి.. డ్రైవర్ సజీవ దహనం

**రాంచీ:** రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు చెలరేగాయి. కొన్ని క్షణాల్లోనే ఆ కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో మంటల్లో కాలి డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఇది చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు. జార?ండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. కద్మా ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ కారును రోడ్డుపై ఆపాడు. ఆ కారు డిక్కీలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆ మంటల్లో కారు కాలిపోయింది. కారు డ్రైవ్ చేసిన వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటన చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు. కాగా, ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ బృందం అక్కడకు చేరుకున్నారు. మృతుడ్ని సునీల్ అగర్వాల్‌గా గుర్తించారు. కారు పేలిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



## వక్ఫ్ చట్టం చట్టబద్ధతపై
## రేపు 'సుప్రీం'లో మళ్లీ విచారణ..!



కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపు సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారణ జరుపనున్నది. గత విచారణ సమయంలో చట్టంలోని రెండు వివాదాస్పద నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం హామీ ఇచ్చింది. మే 5వ తేదీ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించొద్దని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. గత విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అన్నిరకాలుగా జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే చట్టాన్ని రూపొందిం చినట్లు పేర్కొంది. ప్రభుత్వం పూర్తిస్థాయి వాదనలు వినకపోవడం సముచితం కాదని పేర్కొన్నారు. ఇవే పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా వక్ఫ్‌గా న్యాయస్థానాలు ప్రకటించిన ఆస్తులను ప్రస్తుతానికి వక్ఫ్ జాబితా నుంచి తొలగించొద్దని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో ఎక్స్-అఫీషియో సభ్యులు మినహా మిగతా సభ్యులంతా కచ్చితంగా ముస్లింలే అయ్యుండాలనీ చెప్పింది. మతంతో సంబంధం లేకుండా ఎక్స్ అఫీషియో సభ్యులను నియమించొచ్చని.. ఈ మేరకు వక్ఫ్(సవరణ) చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై స్టే విధించేందుకు ప్రతిపాదించింది. వక్ఫ్ (సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన 72 పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖయ్యాయి. ఇప్పటికే పలుసార్లు విచారించిన సర్వోన్నత న్యాయస్థానం కేంద్రం విజ్ఞప్తి మేరకు గడువు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు మే 5వ తేదీకి వాయిదా వేసింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్లప విచారించనున్నది.

## 'అది నా బాధ్యత..
## మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుంది'



దిల్లీ: భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం రక్షణ మంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పని తీరు, పట్టుదల గురించి అందరికీ తెలుసన్న రాజ్‌నాథ్.. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి తీరుతుందని తాను హామీ ఇస్తున్నానన్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు, పాక్‌పై ప్రతీకార చర్యలను కేంద్రం పరిశీలిస్తున్న వేళ రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. దిల్లీలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మన వీర సైనికులు ఎల్లప్పుడూ దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతుంటే.. రుషులు, జ్ఞానులు దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారు. ఒక వైపు మన సైనికులు యుద్ధ భూమిపై పోరాడుతుంటే.. సాధువులు జీవన భూమిపై పోరాడుతున్నారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం నా బాధ్యత. దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నా విధి. మీకు మన ప్రధాని గురించి బాగా తెలుసు. ఆయన వర్కింగ్ స్టైలేంటో, పట్టుదల ఏంటో తెలుసు. ఆయన సారథ్యంలో మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని మీకు హామీ ఇస్తున్నా. భారత్ శక్తి సాయుధ దళాల్లోనే కాదు.. దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉంది" అని వ్యాఖ్యానించారు.

## కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేస్తారా..?
## బ్రిటన్ మంత్రి ఏమన్నారంటే?



**దిల్లీ:** బ్రిటన్ మహారాణి కిరిటంలో పొదివి ఉన్న కోహినూర్ వజ్రం విశిష్ఠత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దానిని తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ బదులిచ్చారు. భారత్, బ్రిటన్ మధ్య సాంస్కృతిక కళాఖండాల మార్పిడి కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్లు చెప్పారు. అన్నీ సానుకూలంగా జరిగితే.. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం రావొచ్చని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఇదే అంశంపై భారత్ సాంస్కృతిక శాఖ మంత్రితోనూ చర్చించినట్లు చెప్పారు. అధికారిక పర్యటనలో భాగంగా ప్రస్తుతం లీసా నాండీ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. సృజనాత్మకత, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో భారత్‌లో దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు లీసా తెలిపారు. " సినిమా, టీవీ, మ్యూజిక్, క్రీడా రంగాల్లో బ్రిటన్ దూసుకుపోతోంది. ఆయా రంగాలకు సంబంధించిన బ్రిటన్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. భారత్ సహకరిస్తే.. వాటిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ల వచ్చన్న గట్టి నమ్మకం మాకుంది. అందుకు భారత్ కూడా మద్దతిస్తుందని ఆశిస్తున్నాం" అని లీసా తెలిపారు. భారత్ పర్యటన కోసం శుక్రవారం దిల్లీ చేరుకున్న ఆమె.. సాంస్కృతిక శాఖకు సంబంధించిన పలు ఒప్పందాల గురించి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిపైనా ఆమె స్పందించారు. ఈ దారుణఘటనలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచదేశాలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాగా, భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో మహారాజ్ దులీప్ సింగ్.. విక్టోరియా మహారాణికి ఇచ్చేశారు. అప్పటి నుంచి ఆ వజ్రం వారి ఆధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో అమర్చారు. అయితే, దానిని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.

# త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీ

-మొదటిపేజీ తరువాయి

ఏ మంచి కార్యక్రమాన్ని చేపట్టినా వైకాపా వాళ్లు విమర్శలు చేస్తున్నారని.. తెదేపా శ్రేణులు వాటిని తిప్పికొట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమ విజయం కోసం కృషి చేసిన పార్టీ కార్యకర్తలు, నేతలందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న ఈ సభ.. గతంలో జరిగిన అన్ని సభలను మించి విజయవంతమైందని, ఈ కార్యక్రమంతో దేశం, ప్రపంచం దృష్టి మరోసారి అమరావతిపై కేంద్రీకృతమైందని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని పిలవడానికి

కారణం ఇదేనని వెల్లడించారు.

"అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమం చాలా బాగా జరిగింది. సభ విజయవంతానికి కృషి చేసిన కార్యకర్తలు, నేతలందరినీ అభినందిస్తున్నా. రాష్ట్రానికి గతంలో ప్రధాని నరేంద్రమోదీ వచ్చినప్పటికీ ఈసారి అన్నింటినీ మరిపించేలా ఈ సభ జరిగింది. రాజధాని పనుల పునఃప్రారంభం కార్యక్రమంతో దేశం, ప్రపంచం దృష్టి అమరావతిపై మళ్లింది. అమరావతి ఆవశ్యకతను తెలియజేసేందుకు, పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రధాని చేతుల మీదుగా పునఃప్రారంభం చేశాం.

వికసిత్ భారత్ 2047కు అమరావతి బలమైన పునాదిగా మారుతుందని ప్రధాని అన్నారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం ఇక ఇబ్బందులు లేకుండా ముందుకెళుతుంది. 5 కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవానికి అమరావతి ప్రతీక. యువతకు అవకాశాలు, ఉద్యోగాలు కల్పించే విశ్వనగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుంది.

ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని ప్రధాని మోదీ, నేను, పవన్ కళ్యాణ్ చెప్పాం. చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చాక గతి తప్పిన రాష్ట్రాన్ని గాడినపెట్టాం. పోలవరానికి నిధులు రాబట్టి 2027 నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. మూతబడే స్థితిలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి రూ.11,400 కోట్లు కేంద్రం నిధులు కేటాయించేలా చేసుకున్నాం. ఉత్తరాంధ్ర వాసుల కల అయిన రైల్వేజోన్ సాధించాం. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నాం.

ప్రతినెలా 1వ తేదీనే పేదలకు పింఛను ఇస్తున్నాం. 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. దీపం2 కింద కోటి మందికిపైగా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పాఠశాలల ప్రారంభానికి ముందే తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు రూ.15 వేలు అందిస్తాం.

కూటమి అధికారంలోకి వచ్చి జూన్ 12 నాటికి ఏడాది పూర్తవుతుంది. ప్రభుత్వం చేపడుతున్న కారక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అధికశాతం కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, కోపరేటివ్, ఏఎంసీ ఛైర్మన్‌ల నామినేటెడ్ పదవులను భర్తీ చేశాం. మిగిలినవి కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. సామాజిక న్యాయం పాటించి పదవులకు ఎంపిక చేస్తున్నాం. పార్టీ సంస్థాగత ఎన్నికలు కూడా నిర్వహించుకుంటున్నాం. రాష్ట్ర కమిటీలు మినహా అన్ని కమిటీలు మే 18 నాటికి పూర్తి చేయాలి. ఈ సారి మహానాడును కడపలో మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించుకుంటున్నాం. మహానాడు తర్వాత రాష్ట్ర కమిటీ పూర్తి చేస్తాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీ సభ్యత్వాలు నమోదయ్యాయి. సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులు కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేయాలి. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. కార్యకర్తల, ప్రజల అభిప్రాయాల మేరకు నాయకులు పని చేయాలి. గుజరాత్ మోడల్ ఏపీలోనూ అమలవ్వాలి. సుస్థిర ప్రభుత్వం ఉండటంతో గుజరాత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేపట్టినా వైసీపీ చౌకబారు విమర్శలు చేస్తోంది... తిప్పికొట్టండి. ప్రభుత్వానికి ఇచ్చినంత ప్రాధాన్యతే పార్టీకి కూడా ఇస్తున్నా. ఏడాది పాలనలోనే స్పష్టమైన మార్పులు చూపించి ప్రజలకు నమ్మకాన్ని కలిగించాం" అని చంద్రబాబు వివరించారు.

# మళ్లీ టీడీపీ వైపు

**విజయవాడ :** ఆ ఇద్దరు నేతలు తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు. ఎన్నో కీలక పదవులు అనుభవించారు. కానీ అనుకోని రీతిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా అనుకున్నంత సక్సెస్ కాలేకపోయారు. కేవలం అప్పటి అధికార వైసీపీ ఒత్తిళ్లకు తలొగ్గి ఆ పార్టీలోకి జంప్ చేశారు. కానీ ఇప్పుడు తిరిగి మాతృ పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో వారు పొలిటికల్ సర్కిల్లో నిలబడ్డారు. ఇంతకీ ఎవరా నేతలు? ఏంటా కథ? అంటే వివరాల్లోకి వెళ్దాం. ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయంగా చైతన్యవంతం అయ్యింది. ఈ జిల్లా నుంచి ఎంతోమంది హేమాహేమీలు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. అందులో ఒకరు కరణం బలరామకృష్ణ. సుదీర్ఘకాలం టిడిపి నుంచి ఎమ్మెల్యేగా పనిచేసిన బలరామకృష్ణకు మంత్రి పదవి అన్నది దక్కకుండా పోయింది. ప్రకాశం జిల్లా రాజకీయాలను శాసించిన ఈ నేత అమాత్య అని అనిపించుకోలేకపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీ నుంచి మంత్రిగా అవుతానని భావించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. మరో మాజీ మంత్రి సిద్దా రాఘవరావు ది విచిత్ర పరిస్థితి. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనను మంత్రివర్గంలోకి తీసుకున్నారు చంద్రబాబు. 2019 ఎన్నికల్లో ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఓడిపోవడంతో రాఘవరావు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేవలం వ్యాపారాలపై ఒత్తిడి పెరగడంతోనే వీరు వైసీపీలో చేరినట్లు ఒక ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు తిరిగి టిడిపిలో చేరేందుకు వీరిద్దరూ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కరణం బలరాం విషయంలో టిడిపి నుంచి అనేక అభ్యంతరాలు ఉన్నాయి. ఎందుకంటే చీరాల నుంచి టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు. గెలిచిన తర్వాత పార్టీ క్లిష్ట సమయంలో ఉండగా గుడ్ బై చెప్పారు కరణం బలరాం. అందుకే ఎట్టి పరిస్థితుల్లో కరణం బలరామును



పార్టీలో చేర్పించుకోవద్దని చంద్రబాబుపై టిడిపి శ్రేణుల ఒత్తిడి ఉంది. దీంతో చంద్రబాబు సైతం కరణం బలరాం విషయంలో ముఖం మీద చెప్పినట్లు సమాచారం. అయితే ఆయనను జనసేనలో చేర్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. తన కుమారుడు వెంకటేష్ రాజకీయ భవిష్యత్తు కోసం జనసేనలో చేరేందుకు బలరాం దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మరోవైపు సిద్దా రాఘవరావువిషయంలో మాత్రం టిడిపిలో సానుకూలత వ్యక్తం అవుతోంది. ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి రాఘవరావుకు అరుదైన అవకాశం ఇచ్చారు చంద్రబాబు. 2014లో గెలవడంతో తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2019లో ఎంపీగా కూడా పోటీ చేశారు రాఘవరావు. అయితే ఆయనకు గ్రానైట్ తో పాటు ఇతరత్రా వ్యాపారాలు ఉన్నాయి. అప్పటి అధికార వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడి చేసి రాఘవరావును పార్టీలో చేర్చుకుందని.. తీరా చేర్చుకున్నాక పట్టించుకోకుండా మానేసింది అన్న సానుభూతి ఆయనపై ఉంది. అందుకే రాఘవరావు విషయంలో చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని ప్రచారం సాగుతోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# వీరయ్య చౌదరి మర్డర్ కేసులో కనిపించని పురోగతి

**ఒంగోలు :** ఏపీలో సంచలనంగా మారిన తెలుగుశేం పార్టీ నేత, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యకేసు మిస్టరీ ఇంకా వీడలేదు. పలువురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పోలీసులు నిందితుల అరెస్ట్, హత్యకు సంబంధించిన అంశాలపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఈ కేసులో కొన్ని కీలక విషయాలు బయటకొచ్చాయనే టాక్ వనిపిస్తోంది. ఈ కేసులో ఇద్దరు, ముగ్గుర్ని ప్రధాన సూత్రధారులుగా అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు పోలీసుల అదుపులో ఉండగా.. మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఈ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నిందితలుకు సంబంధించి కూడా క్లారిటీ లేకుండా పోయింది. ముప్పవరపు వీరయ్య చౌదరికి రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉన్నవారు.. ఒంగోలుకు చెందిన యువకుడితో కలిసి ఈ హత్య చేయించినట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. వీరయ్యచౌదరి హత్యకేసులో ఒంగోలుకు చెందిన యువకుడు ఎందుకు భాగస్వామి అయ్యాడనే చర్చ సాగుతోంది. ఆ యువకుడే ఈ హత్యకు ప్లాన్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వీరయ్య చౌదరిని చంపిన వారికి నేర చరిత్ర ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ హత్య కోసం ఒంగోలుకు చెందిన యువకుడు ఒకరితో మరొకరికి పరిచయం లేని వారిని ఎంపిక చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరయ్య చౌదరికి సంబంధించిన వివరాలు చెప్పకుండానే.. నేరుగా హత్యకు హత్యకు ఉసిగొల్పినట్లు ప్రచారం జరుగుతోంది. వీరయ్య చౌదరి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒంగోలుకు చెందిన యువకుడు ముందు డ్రైవింగ్ చేసేవాడు.. ఆ తర్వాత సొంత వ్యాపారం ప్రారంభించాడు. అతడు ఇసుక రవాణా కూడా చేసేవాడని తెలుస్తోంది. ఒంగోలు యువకుడికి వీరయ్య రాజకీయ ప్రత్యర్థుల్లో ఒకరి (ఓ నేత)తో పరిచయాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ నేత ఆ యువకుడ్ని బావా అని పిలుచుకునేంత సాన్నిహిత్యం ఉందని.. గతంలో కొంతకాలం ఇద్దరు కలిసి ఇసుక రవాణా చేసినట్లు తెలుస్తోంది. బావా అని పిలిచే సాన్నిహిత్యం ఉండటంతోనే ఒంగోలు యువకుడు బావ కళ్లలో ఆనందం కోసం ఈ హత్యకు ప్లాన్ చేశాడా అనే చర్చ జరుగుతోంది. లేని పక్షంలో డబ్బుల కోసమే చేశాడా అన్నది వివరాలు తెలియాల్సి ఉంది. ఒంగోలు యువకుడు దొరికితే కానీ ఈ కేసు ఓ కొలిక్కి వస్తుందంటున్నారు. ఈ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారికి నేర చరిత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముప్పవరపు వీరయ్య చౌదరిని అత్యంత దారుణంగా హతమార్చారు.. ఏకంగా 53 కత్తిపోట్లు పొడిచారు, కేవలం నాలుగు నిమిషాల్లోనే అంతా జరిగిపోయింది. వీరయ్యను చంపే క్రమంలో ఓ నిందితుడి చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. ఆ గాయాల నుంచి కారిన రక్తమే ఇటీవల దొరికిన స్కూటీపై పడినట్లు తెలుస్తోంది. అయినా సరే ఆ స్కూటీపైనే నిందితులు పారిపోయినట్లు చెబుతున్నారు. ఈ హత్య చేసినవాళ్లలో నెల్లూరుకు చెందినవాళ్లు ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. వీరికి గతంలో కొన్ని హత్య కేసుల్లో ప్రమేయం ఉందంటున్నారు. ప్రకాశం జిల్లా పోలీసులు ఈ హత్యకేసు విచారణను మరింత వేగవంతం చేశారు.. ప్రస్తుతం వారి అదుపులో ఉన్న అనుమానితులు ఈ హత్య చేశారా?.. వేరేవారి హస్తం ఉందా అనేది తేలాల్సి ఉంది. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తులపై అనుమానాలు మాత్రమే ఉన్నాయి.. వారి పాత్ర గురించి ఇప్పటి వరకు పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.. వారు అధికారికంగా ప్రకటించేవరకు.. అదుపులో ఉన్నవాళ్లు కేవలం అనుమానితులు మాత్రమే.. పోలీసులు చెప్పే వరకు ఈ హత్య ఎవరు చేశారన్నది తేలదు.

## జగన్ హెలికాప్టర్ ఘటన... 10 మంది వైసీపీ కార్యకర్తల అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

నిందితులకు ధర్మవరం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. ఏప్రిల్ 8న శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో ఈ ఘటన జరిగింది. హత్యకు గురైన పార్టీకి చెందిన బీసీ నేత కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ పాపిరెడ్డిపల్లి గ్రామానికి హెలికాప్టర్‌లో వెళ్లారు. ఆ సమయంలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని కొందరు కార్యకర్తలు హెలికాప్టర్ వద్దకు దూసుకువచ్చారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ (ముందు అద్దం) దెబ్బతిన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ పరిణామంతో జగన్ తన పర్యటనను ముగించుకుని రోడ్డు మార్గంలో బెంగళూరుకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి మొత్తం 19 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 10 మందిని అరెస్ట్ చేయగా, మిగిలిన వారి కోసం బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్‌లకు ప్రత్యేక పోలీసు బృందాలను పంపినట్లు వెల్లడించారు. ఘటనపై లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు, హెలికాప్టర్ పైలట్, కో-పైలట్‌లను ఏప్రిల్ 16న విచారణకు పిలిపించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. హెలికాప్టర్ ప్రయాణానికి సురక్షితం కానప్పుడు తిరిగి ఎలా వెళ్లారని వారిని ప్రశ్నించినట్లు సమాచారం. కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ అద్దం నిజంగా పగిలిందా అనే దానిపై పోలీసులకు ముందు నుంచి కొన్ని సందేహాలున్నట్లు తెలిసింది.

**వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు కేసులు: శివశంకర్ రెడ్డి**

మరోవైపు, జెడ్-ప్లస్ కేటగిరి భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రికి సరైన భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే తమ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా ఆరోపించింది. వైసీపీ అధికార ప్రతినిధి పుట్టా శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, ఆయన సోదరుడిపై తప్పుడు అభియోగాలతో కేసులు నమోదు చేశారని, వారి అనుచరులను విచక్షణారహితంగా అరెస్ట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "హెలికాప్టర్ దెబ్బతిని జగన్ రోడ్డు మార్గంలో వెళ్లాల్సి వచ్చినప్పుడే పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. దాన్ని కప్పిపుచ్చుకునేందుకే ప్రకాశ్ రెడ్డి, ఆయన సోదరుడు జనాలను రెచ్చగొట్టారంటూ తప్పుడు కేసులు పెట్టారు. ఇప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో ఆయన అనుచరులను అదుపులోకి తీసుకుంటున్నారు" అని శివ శంకర్ రెడ్డి అన్నారు.

## అకాల వర్షం.. అపార నష్టం..

-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు.

**కాకినాడ పరిధిలో..**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. పట్లలపై నిల్వ చేరిన వర్షపు నీటిని రైతులు తోడుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కాట్రావులపల్లి రైతులు ఆందోళనకు దిగారు.

**ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట, ఓజిలి మండలాల్లో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు. ఓజిలి మండలం గొల్లపాలెం వద్ద పిడుగుపాటుకు కార్తీక్ అనే బాలుడు మృతి చెందాడు. అలాగే వద్ది గుంటకండ్రిక వద్ద ఆనాల భాస్కర్ (50) పిడుగుపాటు కారణంగా మృతి చెందాడు.

**మండవల్లి మండలంలో..**

ఏలూరు జిల్లా మండవల్లి మండలం దయ్యం పాడు గ్రామంలో పిడుగుపాటు కారణంగా సైదు గిరిబాబు (33)మృతి చెందారు. గిరిబాబు తన రొయ్యల చేపల చెరువుపై మేతల కడుతుండగా సడన్‌గా ఉరుము, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో భారీ శబ్ధంతో పిడుగు పడడడంతో గిరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అలాగే ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో ఈదురుగాలుల దాటికి ఇంటిపై భారీ వృక్షం కూలింది. ఈ ఘటనలో ఇంట్లో పడుకుని ఉన్న బాలుడు మృతి చెందాడు.


**మోస్తరు నుంచి భారీ వర్షాలు..**

అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షం కురుస్తుందని చెప్పారు. విశాఖ, కాకినాడ, కోనసీమ పరిసర జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. విపత్తు నిర్వహణ శాఖ ఎండీ రోనంకి కూర్మనాథ్‌తో హోం మంత్రి అనిత ఫోన్‌లో మాట్లాడి, తాజా పరిస్థితిపై ఆరాతీశారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సహాయక చర్యలు అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని మంత్రి అనిత ఆదేశించారు.

## చకచకా అమరావతి పనులు

-మొదటిపేజీ తరువాయి




ఆర్థికాభివృద్ధికి రాజధాని అమరావతి బాటలు వేయనుంది. ప్రధాని మోదీ రాకతో అమరావతి 2.0 మొదలైంది. ఏపీ రాష్ట్రంలో నవశకం మొదలైందనే చెప్పాలి. అమరావతి నిర్మాణ పనులను ఏకకాలంలో చేపట్టేలా దాదాపు 77,250 కోట్లతో అంచనాలు సిద్ధం చేసింది కూటమి ప్రభుత్వం. ఇదే క్రమంలో 49వేల కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లను ఖరారు చేసింది. దీంతో రాజధాని నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ వీలైనంత తొందరగా పని పూర్తి చేయాలని ఫిక్సయ్యింది. ఇదే సమయంలో రాజధాని అమరావతికి రైలు సౌకర్యం కల్పించేందుకు రైల్వే బోర్డు కూడా అంగీకారం తెలుపుతూ 2వేల 47కోట్లను మంజూరు చేసింది. ఎర్రుపాలెం-నంబూర్ మధ్య 56.53 కి.మీ. మేర రైల్వే లైన్ రానుంది. అదేవిధంగా 189.4 కి.మీ. పొడవున అమరావతి అవుటర్ రింగ్ రోడ్ ను 16,310 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదించింది. దీనికి సంబంధించిన ఖర్చును భరించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. మొత్తానికి కేంద్రం సహకారంతో అమరావతి నిర్మాణ పనులు చకచకా సాగిపోనున్నాయి. దీంతో ఏపీ రాజధాని అమరావతి కల అతి త్వరలోనే సాకారం కాబోతుంది. మరో మూడు, మూడున్నరేళ్లలో అమరావతి ఓ అందమైన రూపాన్ని సంతరించుకోనుంది. దీని కోసం ఐదు కోట్ల ఆంధ్రులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

# సంపాదకీయం

## చివరకు కులగణన వైపే మొగ్గు

కులగణన ప్రతిపాదనపై గత కొన్నేళ్లుగా కారాలూ మిరియాలూ నూరుతూ వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎట్టకేలకు తన వైఖరి మార్చుకుంది. వచ్చే జనగణనతోపాటే కులగణన కూడా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ బుధవారం నిర్ణయించటం దేశ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. అయితే ఇప్పటికే అయిదేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న జనగణన ఎప్పుడు ప్రారంభిస్తారన్న అంశంలో స్పష్టత లేదు. స్వాతంత్ర్యానంతరం అణగారిన కులాలు సైతం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటం వంటి పరిణామాల కారణంగా ఆ వర్గాల్లో చైతన్యం పెరిగింది. జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటం లేదన్న అసంతృప్తి ఎక్కువైంది. అందుకే కులగణన జరపాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. దేశంలో దీన్ని మొట్టమొదట స్వాగతించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2021లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కులగణన జరపాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి పంపింది. 2024 జనవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగవంతంగా, శాస్త్రీయంగా కులగణన నిర్వహించారు. బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు సైతం కులగణన చేశాయి. అయితే బీజేపీ మొదటినుంచీ ఈ డిమాండును వ్యతిరేకించింది. 2021 జులై 20 నాడు పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చిన ఆనాటి కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ 'జనగణనలో ఎప్పటిలా ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా లెక్కల సేకరణ మినహా ఇతర కులాల లెక్కింపు జరపరాదన్నది కేంద్రప్రభుత్వ విధానపరమైన నిర్ణయం' అని ప్రకటించారు. బయట ఎక్కడా నేరుగా కులగణనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు ప్రకటనలు చేయకపోయినా, సమాజాన్ని విచ్ఛిన్నం చేయటానికి కాంగ్రెస్ కులాన్ని ఉపయోగించుకుంటున్నదని విమర్శించేవారు. మొన్నటికి మొన్న పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నావికాదళ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను మతం ఏమిటో కనుక్కుని కాల్చిచంపటాన్ని ప్రస్తావించి 'వారడిగింది మతం... కులంకాదు' అని ఛత్తీస్‌గఢ్ బీజేపీ ట్వీట్ చేసింది. అయితే కులగణన చేయటమే సరైందని ఆరెస్సెస్ భావిస్తున్నదని రెండు నెలల క్రితం ఒక ఆంగ్లపత్రిక వెల్లడించినప్పటినుంచీ దీనిపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవచ్చన్న అంచనాలు మొదలయ్యాయి. జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా జరిగితే దేశంలో దాదాపు వందేళ్ల తర్వాత ఆ ప్రక్రియ మళ్లీ అమల్లోకొచ్చినట్టవుతుంది. ఆఖరుసారి వలస పాలకుల హయాంలో 1931లో కులాలవారీ జనాభా లెక్కేశారు. అప్పట్లో 4,147 కులాలున్నట్టు తేల్చారు. 1901లో ఈ సంఖ్య 1,646. తర్వాత 1941లో కూడా కొంతవరకూ జనాభా లెక్కల్లో కులాన్ని గణించారుగానీ రెండో ప్రపంచయుద్ధ కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. పీపుల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు 1992లో జరిపిన ఒక సర్వే ప్రకారం దేశంలో 4,635 కులాలున్నాయి. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణన నిర్వహిస్తామని వాగ్దానం చేశారు. అనంతరం సాంఘికార్థిక సర్వేకింద 2011%-%12 మధ్య ఆ లెక్కలు తీశారు. కానీ ఆ డేటాను బయటపెట్టలేదు. ఇటీవల జనగణనపై కాంగ్రెస్ పట్టుబట్టడం మొదలైంది. మతంపై ప్రధానంగా కేంద్రీకరించే బీజేపీ ఇందుకు ససేమిరా సమ్మతించబోదని, అందువల్ల ఎన్నికల్లో కులగణన తనకు ప్రధాన ఆయుధంగా మారుతుందని ఆ పార్టీ భావించింది. కానీ బీజేపీ హఠాత్తుగా మనసు మార్చుకోవటంతో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నినాదం లేకుండా పోయింది. అణగారిన కులాలు అడిగాయని కాదు... కులం ఒక వాస్తవం అయినప్పుడూ, సమాజంపై దాని ప్రభావం అమితంగా వున్నప్పుడూ ఎవరి సంఖ్య ఎంతో తేల్చటం ప్రభుత్వాల బాధ్యత. ఇన్నాళ్లూ దాన్ని విస్మరించారు. ఇందువల్ల రెండు రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమ ఫలాలు లక్షిత వర్గాలకు సరిగా చేరటం లేదు. ఇప్పటికీ విద్యాగంధం అంటని, ప్రభుత్వ పథకాల సంగతే తెలియని కులాలవారు గణనీయంగావున్నారు. ఫలితంగా బడ్జెట్‌లలో గర్వంగా ప్రకటించుకునే పథకాలు ఆచరణలో నిరుపయోగం అవుతున్నాయి. ఇక ఇంద్ర సాహ్ని కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు నిర్ణయం కోటా పెంపు ప్రయత్నాలకు అవరోధమవుతోంది. సమస్య వుందని ప్రభుత్వాలకు తెలిసినా, కొత్తగా తెరపైకొస్తున్న కులాలకు న్యాయం చేద్దామనుకున్నా అసాధ్యమవుతున్నది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్య కులాల హవా కొనసాగుతోంది. సమయానుకూల నిర్ణయాలు తీసుకోవటంలో, గాలివాలుకు అనుగుణంగా దూసుకెళ్లటంలో బీజేపీ దరిదాపుల్లోకొచ్చే రాజకీయపక్షం మరొకటి లేదు. వాస్తవానికి గత లోక్‌సభ ఎన్నికల ముందూ... మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భాల్లో కులగణనపై కేంద్రం నిర్ణయం ప్రకటిస్తుందని అందరూ భావించారు. అలాచేస్తే కాంగ్రెస్ డిమాండుకు తలొగ్గినట్టయ్యేది. పహల్‌గామ్ మారణకాండపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నవేళ కులగణన నిర్ణయం తీసుకోవటంతో అది తన ఘనతేనని కాంగ్రెస్ చెప్పుకునే పరిస్థితి లేకుండాపోయింది. పైగా కేంద్రంలో ఎక్కువకాలం అధికారంలోవున్నా కులగణన జోలికి పోకపోవటం... 2011%-%12లో ఆ పని చేసినా దాన్ని సామాజికార్థిక సర్వేగా చెప్పటం ఆ పార్టీకి పెద్ద మైనస్. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకున్నా తాజా నిర్ణయం నిస్సందేహంగా బీజేపీకి ఉపకరిస్తుంది. అయితే దీని వెంబడి రాగల ఇతరేతర డిమాండ్లతో ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుందన్నది చూడాలి.

# పచ్చని పల్లెల్లో రాజకీయాల చిచ్చు



పల్లెటూరు అంటేనే ప్రకృతి సోయగాలు, అందమైన జీవితం, ఆనందాయక జీవనం, పరస్పర సహకారం, స్నేహబంధాలకు నిలయం. గడిచిన తరాల పల్లె ప్రజలు భేదాభిప్రాయాల కంటే బంధాలు, బంధుత్వాలకు ఎక్కువ విలువిచ్చేవారు. కానీ, రాను రాను కొన్ని పల్లెల్లో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైంది. కొందరు నేతలు తమ స్వార్థం కోసం పల్లె ప్రజలను కులాలుగా, వర్గాలుగా విడగొడుతున్నారు. వారిలో వారికే చిచ్చుపెట్టి పగలు, ప్రతీకారాలతో కొట్టుకుచచ్చేలా చేస్తున్నారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడేలా చేస్తున్నారు. పల్లె గడ్డపై రాజకీయ చిచ్చు నెమ్మదిగా వ్యాపించి, ఐక్యతను చీల్చే విషంలా మారి కల్మషమెరుగని మనుషుల మధ్య విద్వేషాన్ని పెంచుతున్నది. ప్రతి ఎన్నికతో పాటే పల్లెల్లో విభేదాలు, పగలు, ప్రతీకారాలు పెరుగుతున్నాయి. వర్గాలుగా విడిపోయిన ప్రజలు చిన్నచిన్న విషయాలపైనా గొడవ పడుతున్నారు. చివరికి ప్రాణాలు తీయటానికి కూడా వెనకాడని పరిస్థితికి వచ్చారు. ఒకే ఊరిలో రెండు వర్గాలు, రెండు ధ్వజాలు. ఒకే ఉత్సవానికి వేర్వేరు వేదికలు ఉండటం.. మిత్రులుగా ఉన్నవారు శత్రువులుగా, శత్రువులుగా ఉన్నవారు మిత్రులుగా మారడం చూస్తున్నాం. కొన్నిసార్లు బంధువులను కూడా బద్ధ శత్రువులుగా మారుస్తున్నాయి పల్లె రాజకీయాలు. చాలా చోట్ల గ్రామ పంచాయతీ సమావేశాలు అభివృద్ధి చర్చల కోసం కాకుండా పరస్పర ఆరోపణలకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగే సమావేశాల్లో అభివృద్ధి ప్రణాళికల గురించి కంటే పార్టీల గొడవలు, కార్యకర్తల కొట్లాటలు, ఎవరు ఏ పార్టీకి చెందినవారనే విషయాలే ప్రధానాంశాలు అవుతున్నాయి. పల్లెలో పార్టీకో పెద్ద రాజకీయ నాయకుడు, అతని కింద చిన్న నాయకులు.. వారి పంతమే నెగ్గాలనే ఆలోచనలు.. వెరసి గ్రామాభివృద్ధి కుంటుపడి రాజకీయ కక్షలు పెరుగుతున్నాయి. ఈ వర్గ విభేదాల కారణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ, ముఖ్యంగా అర్హులైన వారికి చేరడం లేదు. నిత్యావసర సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కొందరికే పరిమితమవుతున్నాయి. పథకాలు అర్హులైన, అవసరమైన వారి దరి చేరకుండా ఈ వర్గ రాజకీయాలు అడ్డుకుంటున్నాయి. చాలామంది వృద్ధులు, మహిళలు, పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఒకప్పుడు గ్రామాభివృద్ధి కోసం కలలు కన్న యువత రాజకీయ అసహనంతో అట్టుడుకుతున్నారు. వారి హృదయాల్లో నూతన ఆశలు మొలకెత్తాల్సిన సమయంలో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయి. ఊరంతా కలిసికట్టుగా ఎదగాలనే కలలు.. 'మా వర్గమే గెలవాలనే కుటిల కాంక్షలో కనుమరుగైపోతున్నాయి. ఒక పార్టీ గెలిచి మరో పార్టీ ఓడినప్పుడు గ్రామం గెలవదు. గ్రామం గెలవడం అంటే ప్రతి ఇంట్లో వెలుగు నిండటం.. ప్రతి కుటుంబంలో సంపద పెరగడం.. గ్రామంలో పిల్లలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందడం.. వృద్ధులకు గౌరవం లభించడం.. ప్రభుత్వ పథకాలు బలహీనవర్గాలకు అందడం. ఒక్కమాటలో చెప్పాలంటే గెలుపంటే సామూహిక అభివృద్ధి. రాజకీయాలు చేయడం, పార్టీలకు మద్దతుగా నిలవడం తప్పు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారానే తన భవిష్యత్తును నిర్ణయించే నాయకున్ని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉంది. కానీ, అది గ్రామస్థాయిలో వ్యక్తిగత పగ, ప్రతీకారాలకు సాధనంగా మారడం మాత్రం సరైనది కాదు. అందుకే పల్లె ప్రజలు విచక్షణతో మెలగాలి. పెద్ద పెద్ద నాయకులంతా బాగానే ఉంటారు. కానీ, గ్రామాల్లో సామాన్య కార్యకర్తలు మాత్రం కక్షలతో జీవిస్తుంటారు. ఇలా పగప్రతీకారాలు పెంచుకుంటూపోతే మనుషులు మాత్రమే కాదు, పల్లె కూడా నాశనమవుతుంది. వర్గ, కుల బలహీనతల్ని వదిలి, గ్రామాన్ని బతికించుకోవాలి. అభివృద్ధి పథంలో నడిపించుకోవాలి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, గ్రామ సమష్టి శ్రేయస్సు కోసం రాజకీయాలు చేయాలి. తాత్కాలికమైన వాటి కోసం బంధాలను, స్నేహాలను దూరం చేసుకోవడం సరికాదు. రాజకీయం ఎప్పుడూ అభివృద్ధి కోసం ఉండాలి. అంతేతప్ప వినాశనానికి కాదు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఈ రాజకీయ కక్షలను పక్కనపెట్టి.. పల్లెలో సౌభ్రాతృత్వాన్ని, సహకారాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన పల్లెను మళ్లీ పచ్చగా, సస్యశ్యామలంగా మార్చాలి. అభివృద్ధి మార్గంలో అందరూ కలిసికట్టుగా సాగడమే ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం.

# ఐక్యత వర్తమాన అవసరం



ప్రపంచమంతా ఒక రకమైన అనిశ్చితిలో రోజులు వెళ్లదీస్తున్న వర్తమానంలో మరో మారణకాండకు పథకం పన్ని, అమలుచేసి కశ్మీర్ సమస్యను మళ్లీ తెరపైకి తేవాలనుకున్న పాకిస్తాన్‌కు మన దేశం నుంచి గట్టి హెచ్చరికే వెళ్లింది. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేయటంతో సహా తీసుకున్న చర్యలు సహజంగానే పాకిస్తాన్‌ను ఇరకాటంలో పడేశాయి. అటారీ సరిహద్దు మూత, దౌత్యసంబంధాలకు పరిమితుల విధింపు, పాకిస్తాన్ పౌరులకు భారత్‌లో ప్రవేశం నిషేధం వంటి నిర్ణయాలు దీనికి అదనం. నిజానికి సింధూ నదీజలాల ఒప్పందం నిలిపివేతను పాకిస్తాన్ ఊహించలేదు. ఎందుకంటే ఇరు దేశాల మధ్యా యుద్ధం వచ్చిన సందర్భాల్లో... ముంబైపై ఉగ్రదాడి జరిగినప్పుడు లేదా పుల్వామాలో మన జవాన్లను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నప్పుడు కూడా మన దేశం ఆ ఒప్పందం నిలిపివేత గురించి మాట్లాడలేదు. సింధూ నదీజలాలపై పాకిస్తాన్ సాగురంగం 80 శాతం వరకూ ఆధారపడి వుంటుంది. పైగా ప్రపంచంలో తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొనే దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. సింధు, జీలమ్, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదులకు సంబంధించిన సమస్త సమాచారమూ కూడా ఈ ఒప్పందంలో ఇమిడివున్న వేళ మన దేశ నిర్ణయం పాకిస్తాన్‌కు శరాఘాతమే అవుతుంది. భారత్ చర్యలకు ప్రతిగా పాకిస్తాన్ సైతం చర్యలు తీసుకున్నా అది పరువు కాపాడుకోవటానికి చేసే ప్రయత్నం మాత్రమే. ఎలా చూసినా పాకిస్తాన్ ఒక రకంగా ఒంటరి బతుకు బతుకుతోంది. అమెరికాకు అఫ్గాన్ పెను సమస్యగా కనబడినంత కాలమూ అది పాకిస్తాన్ సాయం తీసుకోక తప్పేది కాదు. అందుకోసం పాక్ తరఫున మాట్లాడటం, అది ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదన్న ఆరోపణలొస్తున్నా అమాయ కత్వం నటించటం అప్పట్లో అమెరికాకు అలవాటు. ఉగ్రవాదులకు అండదండలందిస్తున్నట్టు ఆధారాలున్నా ఏనాడూ పాక్‌కు ఆర్థిక సాయం ఆగకుండా చూసిన ఘనత అమెరికాది. 2021లో అఫ్గాన్ నుంచి బతుకుజీవుడా అనుకుంటూ నిష్క్రమించాక అమెరికాకు పాకిస్తాన్‌పై మునుపటి ప్రేమ, వాత్సల్యాలు తగ్గుముఖం పట్టాయి. పర్యవసానంగా అప్పు దొరక్క పాక్ ఇబ్బంది పడుతోంది. గల్ఫ్ దేశాలు కూడా గతంలో మాదిరి కాసుల వర్షం కురిపించటం లేదు. చైనా సరేసరి. అదెంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) పాకిస్తాన్‌లో నత్తనడ కన సాగటం, నిర్మాణ పనులకు ఎదురవుతున్న ఆటంకాలు చైనాకు ఆగ్రహం కలిగిస్తున్నాయి. గత కొన్నే ళ్లుగా కశ్మీర్ విషయంలో పాక్‌ను సమర్థించటం మొదలెట్టిన తుర్కియే హఠాత్తుగా గత ఏడాది స్వరం మార్చింది. గల్ఫ్ దేశాలు సైతం పాకిస్తాన్ తీరు మారనంత కాలమూ తాము మద్దతు నీయటం కష్టమేనని భావిస్తున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా ఇలా ఏకాకిగా మారుతున్న సమ యంలో పహల్గామ్‌లో బరితెగించి ఉన్మాదులను ప్రోత్సహించటం వల్ల మరింతగా నష్టపోతానని పాకిస్తాన్ గ్రహించలేకపోయింది. అంతర్జాతీయంగా ఏర్పడిన ఉద్రిక్తతలు చివరకు యుద్ధానికి దారి తీయొచ్చని చాలామంది జోస్యం చెబుతుండగా నిజంగా ఆ పరిస్థితే వస్తే భౌగోళికంగా తమ అవసరాల కోసమైనా అమెరికా, చైనాలు తన కోసం అశ్రులు చాస్తాయన్న అభిప్రాయం పాకిస్తాన్‌కు ఏదోమూల వున్నట్టు కనబడుతోంది. అందుకే పహల్గామ్ దుస్సాహసానికి పూనుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పహల్గామ్‌కు ప్రతీకారం ఉండి తీరుతుందని ప్రకటిస్తున్నారు. 2016లో ఉరిలో ఉగ్రవాదుల మారణకాండ తర్వాత, 2019లో పుల్వామాలో జవాన్లపై ఉగ్రదాడి అనంతరం మన దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్రశిబిరాలపై సర్జికల్ దాడులను నిర్వహించాయి. అందు వల్ల వచ్చిన లాభనష్టాలేమిటన్న మాట అలావుంచి ఉగ్రదాడులు తగ్గివుండొచ్చుగానీ ఆగింది లేదు. పౌరుల్లో ఆత్మస్థైర్యం నింపటానికి ప్రతి చర్యలు అవసరమే. అవి కొనసాగవలసిందే. కానీ అక్కడితో అంతా అయిందనుకోవటంలోనే వుంది సమస్యంతా! ఒకప్పుడు కశ్మీర్‌లో అధికార గణాంకాల ప్రకారం 7,000 మంది ఉగ్రవాదులుండేవారు. కానీ వారి సంఖ్య ప్రస్తుతం 76 మాత్రమేనని గత నెలలో విడుదలైన గణాంకాలు చెబుతున్నాయి. అందులో 59 మంది బయటివారు కాగా, కేవలం 17 మంది మాత్రమే స్థానికులు. ఉగ్రదాడుల్లో మృతుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. కశ్మీర్‌ను గత 35 యేళ్లుగా ఉగ్రవాద భూతం పట్టిపీడిస్తోంది. తొలినాళ్లలో ఏడాదికి ఇంచుమించు వేయిమంది బలయ్యేవారు. 2001 సంవత్సరంలో ఉగ్రవాదులు ఏకంగా 4,011 మందిని పొట్టన బెట్టుకున్నారు. కానీ నిరుడు ఆ సంఖ్య 127. కొందరు ప్రతీకారేచ్ఛను ప్రదర్శిస్తున్నారు. కానీ ప్రభుత్వం ఒక చర్య తీసుకునే ముందు ఎన్నో బేరీజు వేసుకోవాల్సి వుంటుంది. అది యుద్ధంగా మారిన పక్షంలో... మనవైపు గట్టిగా నిలబడే వారెవరు, వ్యూహాత్మకంగా ఎదురయ్యే సమస్యలేమిటి, దళాల సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యాల్లో మన స్థానం ఏమిటి అనేవి చూసుకోవాలి. ఇదే అదనుగా కొన్ని రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థులపై దాడులు, బెదిరింపులు మొదలయ్యాయి. మొన్నటికి మొన్న పహల్గామ్‌లో కశ్మీరీ పౌరులు ప్రాణాలకు తెగించి అనేకమందిని కాపాడిన వైనం ఇలాంటి వారికి తెలిసి వుండక పోవచ్చు. ఉగ్రవాద బెడద తగ్గటంలో స్థానికులు అందిస్తున్న సహకారమేమిటో వారికి అర్థంకాకపోయి వుండొచ్చు. మన పౌరుల్ని మనమే మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో దూరం చేసుకుంటే ఉగ్రవాదుల అభిమతం నెరవేర్చినట్టే అవుతుంది. నిజానికి వారు కోరుకునేది ఈ విద్వేషాన్నే! ఒకపక్క ఉగ్రవాదం అంతానికి దేశమంతా ఒక్కటై నిలబడాలని ప్రధాని పిలుపునిస్తుంటే తద్భిన్నంగా ప్రవర్తించటం విజ్ఞత అనిపించుకోదు.

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు

అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమాలను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయకారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీయులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు, త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉ పనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్య దంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మించారు. ఆయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలుగు బ్రాహ్మణులు, త్రిలింగ వైదీకులు, అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువారూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు. తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహాలను పూజిస్తూ, "ఉ ఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాముని పై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు.

# తండ్యాంలో కుక్కల బెడద

- ఇష్టానుసారంగా పిచ్చి కుక్కల స్వైర విహారం
- ఆవులపై దాడి ,ఒక దూడ మృతి
- కుక్కల బెడదతో ఆందోళన చెందుతున్న గ్రామ వాసులు



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం తండ్యాం గ్రామంలో కుక్కల బెడద ఎక్కువ కావడం తో గ్రామ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంపులు గుంపులుగా రోడ్ల మీద స్వైర విహారం చేస్తూ దాడికి పాల్పడుతున్నాయి. ఆదివారం నాడు గ్రామంలో ఉన్న లంకల పిల్లి వెంకట్రావు అనే పాడి రైతు వద్ద ఉన్న ఆవులపై కుక్కలు తీవ్రంగా దాడి చేశాయి. ఈ దాడిలో రెండు ఆవులకు గాట్లు పడగా,ఒక దూడ మృతి చెందింది. దీంతో స్థానిక సర్పంచ్ ప్రతినిధి కిలారి భాస్కర రావు కుక్కలు దాడికి చేసిన వెంటనే మండల పశు వర్ధక శాఖ ఏ.డి బాలకృష్ణ కు సమాచారం అందించగా ఆయన తక్షణమే స్పందించి పశు వైద్యులను పంపించారు. వైద్యులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా కొంత సమయం తరువాత దూడ మృతి చెందింది. కుక్కలు ఇష్టానుసారంగా తిరగడంతో వీధుల్లోకి పిల్లల్ని పంపించా లంటే తల్లిదండ్రులు ఆందోళన చేందుతున్నారు. ఎక్కడికక్కడే పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ గుంపులు గుంపులుగా ఉండటంతో అడుగు పెట్టాలంటే భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ఆదమరిచి నడిచారో గ్రామ సింహాల నోటికి చిక్కి పెద్దాసుపత్రికి పరుగులు తీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి ప్రజలను ,మూగజీవులను కాపాడాలని సర్పంచ్ ప్రతినిధి కిలారి భాస్కర రావు కోరుతున్నారు.

# చలనచిత్ర చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్న దాసరి.






**దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి వేడుకలలో మంత్రి నిమ్మల రామానాయుడు.**

పాలకొల్లు. ప్రజాజ్యోతి. (కొట్టి రామం )మే 4. దర్శకుడు, రచయిత నటుడు నిర్మాత దాసరి నారాయణ రావు చలనచిత్ర చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పాలకొల్లులో ఆదివారం స్వర్గీయ దాసరి నారాయణరావు జయంతి వేడుకలను దాసరి కాంస్యవిగ్రహనిర్మాణకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న మంత్రి నిమ్మల దాసరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో దాసరి ఖ్యాతి ఉభయ తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశంనలుమూలలా వ్యాప్తిచెందిందన్నారు. 151 సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సృష్టించిన ఏకైక దర్శకుడు దాసరి అని అన్నారు. ఆయన తీసిన సినిమాలు మంచి సందేశం తో పాటు సమాజాన్ని చైతన్యపరిచాయని తెలిపారు. అందుకే దాసరి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకుని వారిని భావితరాలతో పాటు భవిష్యత్ తరాలు గుర్తుండేలా నావంతు కృషి చేస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి అభిమానులు , పురప్రముఖులు,రాజకీయనాయకులు వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నం, బోనం చిన బాబు,పెచ్చెట్టి బాబు, జీవి, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మండేల పణినాథ్ ,బళ్ల లక్ష్మణరావు, కొండ్రెడ్డి సూరిబాబు, రాయి సూరిబాబు, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, తాళబత్తుల వెంకటేశ్వరరావు, పి.నాగలింగేశ్వరరావు, గుడాలహరిబాబు, ఎం ఎన్ వి సాంబశివరావు,చుండూరి శ్రీరంగ నాయుడు,కానూరీ ప్రభాకర్ జి బాబు, చెరుకూరి శ్రీనివాసరావు, మండేల పెద్ద, చినిమిల్లి గణపతి రావు, వీరా పోతన, , అందే కోటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# పెండింగు ఈ-చలానాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలి..

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** వాహనాలపై పెండింగులో ఉన్న ఈ-చలానాలు చెల్లించే వరకు వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. పెండింగు ఈ-చలానాలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. రహదారి భద్రత పట్ల వాహనదారులకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాని అదేశించిన జిల్లా ఎస్పీ జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహనదారులపై పెండింగులో ఉన్న ఈ- చలానాలను చెల్లించే విధంగా పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మే 4న ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పోలీసు స్టేషను పరిధిలో వాహన తనిఖీలు చేపట్టి, ఆయా వాహనాలపై పెండింగులో ఉన్న ఈ-చలానాలను వాహనదారులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్లు చేపట్టి, వాహన తనిఖీల్లో వాహనాల రికార్డులను పరిశీలించి, ఆయా వాహనాలపై ఏమైనా పెండింగు ఈ-చలానాలు ఉన్నవి, లేనిది చెక్ చేయాలన్నారు. ఆయా వాహనాలపై ఏమైనా ఈ చలానాలు పెండింగులో ఉన్నట్లయితే, వాటిని వాహనదారులు చెల్లించేంత వరకు ఆయా వాహనాలను సీజ్ చేయాలన్నారు. ఎం.వి.నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఈ-చలానాలను విధిస్తున్నప్పటికీ వాహనదారులు వాటిని చెల్లించుటలో నిర్లక్ష్యం వహించడం వలన ఆయా వాహనాలపై ఈ-చలానాలు పెండింగులో ఉండిపోతున్నాయన్నారు. కావున, పోలీసు అధికారులు ఈ తరహా వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగు ఈ-చలానాలను వాహనదారులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగులోఉన్న ఈ-చలానాలను చెల్లించేంత వరకు వాహనాలను కూడా సీజ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. వాహన తనిఖీలు చేపట్టే సమయాల్లో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అదే విధంగా ఎం.వి.నిబంధనలను ఉల్లంఘించినా వారిపై ఈ చలానాలను క్రొత్తగా విధించాలని, పెండింగులో ఉన్న చలానాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.







# ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యునిగా లోవరాజు.

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్**

-ప్రత్తిపాడు:, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యునిగా ప్రత్తిపాడు మండలం చెందిన విశాలాంధ్ర రిపోర్టర్ బర్ల లోవరాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కాకినాడ జేఎన్టీయూ అల్యూమినియం హాల్ లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా మాజీమంత్రి, సీనియర్ టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ , పేరాబత్తుల రాజశేఖరం, తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అధికారులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టులు కే





స్వాతి ప్రసాద్, దుర్రానిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన లోవరాజు ను ప్రత్తిపాడు ప్రెస్ క్లబ్ సభ్యులు, మరియు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఉపాధ్యాయుల సమ్మేళనం



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామం లో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో గెట్ టుగెదర్ టెన్త్ 2005 2006 బ్యాచ్ మా స్నేహితులతో మా స్కూల్ నందు టీచర్స్ తో కలిసి ఎన్నో సంవత్సరాలుగా వెయిట్ చేస్తున్న సందర్భం రానే వచ్చిందని ఎంతో ఆనందంగా మా స్నేహితులందరుఎంతో ఉత్సాహంగా అందరు కలిసిమెలిసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు గారిని ఆహ్వానించడం జరిగినది

## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రారంభమైన అడ్మిషన్లు...

**మే 4,(ప్రజా జ్యోతి)తిరుపతి జిల్లా ప్రతినిది** తిరుపతిలో ఉన్న ప్రముఖ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లుగా అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు. పదవ తరగతి ఉత్తీర్ణులై సంస్కృతంలోని శాస్త్రాలతో పాటుగా ఆంగ్లం, హిందీ, తెలుగు భాషలలో మరియు కంప్యూటర్, మేథ్స్, యోగ, భరతనాట్యం, సితార, ట్రాన్స్లేషన్ మొ. విషయాలలో చక్కటి డిగ్రీను చదవాలనుకునే వారికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆన్లైన్ అప్లికేషన్లు ఆహ్వానిస్తోంది. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పదవ తరగతి పూర్తి అయినటువంటి విద్యార్థులు నేరుగా ఆన్లైన్ మాధ్యమంలో అప్లికేషన్ ద్వారా అప్లై చేసుకుని ఒక సెంట్రల్ ఇన్స్టిట్యూట్లో చదువుకునే అవకాశం కల్పిస్తుంది. అదేవిధంగా ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత సంస్కృతంలోని వ్యాకరణ సాహిత్యాది 14 శాస్త్రాలతో పాటుగా ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో మరియు కంప్యూటర్, మేథ్స్, ట్రాన్స్లేషన్, యోగ, మొదలైనటువంటి వాటిల్లో డిగ్రీలు పొంది ఆధునిక భవిష్యత్తు నిర్మించుకోవడానికి కూడా విశ్వవిద్యాలయంలో సంస్కృత శాస్త్రాజ్ఞానంతో పాటు ఆధునిక విషయాలతో విద్యాబోధన చేయడం జరుగుతుంది. ప్రవేశం కోసం మీరందరూ విశ్వవిద్యాలయం యొక్క వెబ్సైట్ www.nsktu.ac.in ఆన్లైన్లో అప్లైచేసి అత్యంత సులభంగా యు.జి మరియు పి.జి కోర్సులలో ప్రవేశాలను పొందవచ్చు. మరిన్ని వివరాల కొరకు విశ్వవిద్యాలయంలోని అకాడమిక్ సెక్షన్ నందు సంప్రదించవచ్చు.




1.ప్రాక్-శాస్త్రి=( ఇంటర్మీడియట్/ ౦2) కోర్సులో ఆన్లైన్ అప్లై చేసుకోవడానికి చివరి తేదీ : 6.6.2025.

2.యు.జి మరియు పి.జి నాన్-సియుటి అప్లై చేసుకోవడానికి త్వరలో అప్లికేషన్ ఆన్లైన్ మాధ్యమంలో ప్రారంభమవుతుంది.

కార్యక్రమ వివరాలు (విద్యా విభాగం)73825 85500, 73825 95500 ఈ.మెయిల్ academics@nsktu.orgఆన్లైన్ అడ్మిషన్ కొరకు nsktuadmission.samarth.edu.in సంప్రదించాలని కోరారు.

## ల్లాసంగా, ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**గుంతకల్లు మే 4 (ప్రజా జ్యోతి):** స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో 2002-2005 విద్యా సంవత్సరం లో బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్ లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది .20 ఏళ్ల క్రితం దూరమైన స్నేహితులు కలుసుకున్న ఆనందంలో ఒకరి నోకరు ఆలింగనం చేసుకుంటూ, తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, అధ్యాపకుల తో గడిపిన క్షణాలను వారు నెమరు వేసుకున్నారు. అలనాటి పాత జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని ఉత్సాహం గా,ఉల్లాసంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల డైరెక్టర్ పి. గోపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయడం ఆనందదాయకమని, దీనివల్ల వ్యక్తుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంద న్నారు.20 సంవత్సరాల క్రితం విద్యా బోధన, బుద్ధి మాటలు నేర్పిన గురువులకు శాలువ లు,పూలమాలతో ఘనంగా సన్మానించారు.పూర్వ విద్యార్థులు అప్పటి గురువు లను తలుచుకుంటూ వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుం టూ మాట్లాడారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు నారాయణ,గోపి, శ్రీనివాసులు,వెంకటేశ్వర్లు, సౌజన్య పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు జక్కి వేణుగోపా ల్,రాకేష్,గణేష్ నవీన, సృజన పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి.

**కమిషనర్ ఎన్.మౌర్య**

**మే 4,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో సోమవారం నుండి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవడం కోసం మరియు కొత్త ఆధార్ నమోదు 5 నుండి 8వ తేదీ వరకు, అలాగే 12 నుండి 15 వ తేదీ వరకు 12 సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దొడ్డాపురం వీధి-01, ఐ.ఎస్ మహల్ రోడ్-02, జర్నలిస్ట్కాలనీ-01, కెనడీ నగర్-01, మధురానగర్-1,2, పోస్టల్ కాలనీ-04, ప్రకాశంరోడ్-02, రాజీవ్ నగర్ జీవకోన-06, శంకర్ కాలనీ -01, రేణిగుంట రోడ్-1, రాజీవ్ నగర్ జీవకోన-03, చెన్నారెడ్డి కాలనీ -03 నందు ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.



# రీ సర్వే తో రైతులకు ఇక్కట్లు

**మ్యూటేషన్లు చేయక ఆందోళనలో రైతులు**
**రీ సర్వే లోపాలపై దృష్టి పెట్టాలని డిమాండ్**
**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది**



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** వైసిపి హయంలో చేపట్టిన భూముల రీ సర్వే తో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన రీ సర్వే లో సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వ కాలంలో చేసిన రీ సర్వే లోపం ,అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మిగిలింది. రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు ఉన్న మండల రెవెన్యూ సిబ్బంది మ్యూటేశన్లు చేయడం లేదని దళారీల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారని పొందూరు మండలం తాడివలస రైతులు ఆరోపిస్తున్నారు.సచివాలయాలు , తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ నెలల తరబడి తిరిగిన సమస్య పరిష్కారం కావడం లేదని అవేదన చెందుతున్నారు. తాడివలస రెవెన్యూ గ్రామ పరిధిలో 2500 మంది రైతులు సుమారు 1400 ఎకరాలు సాగు చేస్తున్నారు. రీ సర్వే ముందు రైతులకు పట్టా ,పాస్ బుక్ లలో ఉన్న విధంగా మ్యూటేషన్లు , వన్ బి ,అడ్డంకులు జరిగేవి. కానీ రీ సర్వే వలన రైతుల పొలాలను గెడ్డలుగా ,స్మశాన వాటిక భూములుగా నమోదు చేయడం తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. . రీ సర్వే లో తప్పిదాల వల్ల రైతు అవసరాలకు భూ అమ్మకాలకు గాని ,కొనుగోలుకు గానీ అడ్డంకులు ఏర్పడుతున్నాయని వాపోయారు. వన్ బి లు రాక బ్యాంకుల్లో తీసుకున్న క్రాపులోన్స్ కట్టాలని బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దీంతో ఈ విషయం పై జిల్లా కెలెక్టర్ కు , రెవెన్యూ డివిజనల్ అధికారి కి ఏప్రిల్ 11వ తేదీన పిర్యాదు చేశారు. రీ సర్వేలో జరిగిన తప్పుల వల్ల నేడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని , రెవెన్యూ సదస్సుల్లో చేస్తున్న పిర్యాదు లకు అసలు పరిష్కారమే లభించడం లేదని పిర్యాదు లో పేర్కొన్నారు. వీటితో పాటు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారి పని తీరుపై పిర్యాదు చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం సచివాలయం కి వెళ్ళిన విఆర్వో అందుబాటులో ఉండటం లేదని , అర్జీల పరిష్కారం విషయంలో కూడా అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. అర్జీల పరిష్కారంలో కొంతమంది వ్యక్తులతో విఆర్వో సత్సంబంధాలు పెట్టుకుని తన అసిస్టెంట్ ద్వారా అమౌంట్ మాట్లాడుకుని వారి సమస్యలకు పరిష్కారం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ విధంగా రైతులకు ఇబ్బందులు పెడుతున్నారని , వీటితో పాటు మంచం పట్టిన వృద్దులకు , వికలాంగులకు రేషన్ ఇవ్వవలసి ఉన్న మూడు నెలలుగా వారికి రేషన్ ఇవ్వకపోవడం తో స్థానిక సర్పంచ్ చొరవ తీసుకుని వెంటనే మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారించారు. విధులలో ఇంతటి నిర్లక్ష్యం వహిస్తున్న విఆర్వో పై పై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మ్యూటేశన్లు విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

# స్నేహితులంతా సరదాగా....







– 1997–98 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక
– ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** స్నేహితులంతా ఒకచోట కలుసుకుని సరదాగా గడిపారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ తమ బాల్యాన్ని గుర్తు చేసుకుని సందడి చేశారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997 -98 వ సంవత్సరం 10 వ తరగతి విద్యార్థులందరూ మండల కేంద్రంలో గల ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో తమ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు , ఉపాధ్యాయులు పాల్గొని చిన్న నాటి బాల్య స్మృతులను ,సన్నివేశాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఆనాటి అనుభవాలను , అనుబంధాలను వేదికపైకి ఎక్కి పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా తమకు ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలను బోధించి నేడు ఈ స్థాయిలో ఉండేలా కృషి చేసిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొగిరి జగన్నాథరావు ,మునగవలస సత్యనారాయణ ,వి ప్రసాద్ రావు ,ఎన్ విద్యవతి , పాలిశెట్టి వెంకటరావు , కుప్పిలి రవి , వాంద్రంగి సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షిని స్మరించుకోవడం మనందరి బాధ్యత

## :కూటమి నేతలు గుమ్మనూరు నారాయణ స్వామి,వాసగిరి మణికంఠ

**గుంతకల్లు మే 4 (ప్రజా జ్యోతి):** సర్వ జీవులకు ప్రాణాధారమైన పవిత్ర గంగను దివి నుండి భువికి తీసుకువచ్చిన మహనీయుడు శ్రీ భగీరథ మహర్షి అని గుంతకల్లు టిడిపి మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, గుంతకల్లు నియోజకవర్గం జనసేన బాధ్యుడు వాసగిరి మణికంఠ అన్నారు. ఆదివారం గుంతకల్లు పట్టణంలోని కసాపురం రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి పక్కన శ్రీ భగీరథ మహర్షి విగ్రహం దగ్గర ఉప్పర (సగర) సంఘం ఆధ్వర్యంలో జయంతి మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి అతిథులుగా గుంతకల్లు నియోజకవర్గం జనసేన బాధ్యుడు వాసగిరి మణికంఠ,టిడిపి గుంతకల్లు మండల ఇన్చార్జ్ శ్రీ గుమ్మనూరు నారాయణ స్వామి,టిడిపి జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ శ్రీమతి హిమబిందు,కూటమి నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొని భగీరథ మహర్షి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కూటమి నాయకులు మాట్లాడుతూ భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.గంగ మాతను భువికి తెచ్చిన ఆ మహనీయుడిని స్మరించడం, పూజించడం మనందరి కర్తవ్యం. ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి.ఆయన స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుంది. పోలవరం ప్రాజెక్టును సాకారం చేసి భగీరథుని కలను నెరవేర్చే దిశగా కృషి చేస్తుందన్నారు. శ్రీ భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం మన సంస్కృతిపై గౌరవానికి నిదర్శనం. అలాగే ఆయన చరిత్రను మరొకమారు పిల్లల పాఠ్యాంశాల్లో చేర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల మని,ఆంధ్రప్రదేశ్లో కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం భగీరథ ప్రయత్నంలా ఉందని అన్నారు.భగీరథ మహర్షి స్ఫూర్తితోనే రాష్ట్ర పరిపాలన సాగుతుందని కూటమి నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పర సంఘం అధ్యక్షులు గంగన్న, సాగర్ శ్రీనివాస్,ఏఎస్ఐ శ్రీనివాసులు,రమేష్,అడ్వకేట్ నాగ శేషు,తిమ్మప్ప, కృష్ణమూర్తి,వినోద్ కూటమి నాయకులు యాదవ సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఆమ్లెట్ మస్తాన్ యాదవ్,తలారి మస్తానప్ప, కౌన్సిలర్ ప్రభాకర్, చిప్పగిరి ప్రతాప్,మాత్సనాయక్, గాజుల రాఘవేంద్ర,కథల వీధి అంజి,ఆటో రామకృష్ణ, మైనార్టీ నాయకుడు దాదు, దోనిముక్కల విజయ్ కుమార్,లారెన్స్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# అనంతపురం జిల్లా టాపర్ దీక్షిత్ కి సన్మాన కార్యక్రమం

**గుంతకల్లు మే 4 (ప్రజాజ్యోతి):** ఆదివారం పట్టణంలోని పాత గుత్తి రోడ్ నందు గల ఎస్వీ డిగ్రీ కళాశాల నందు రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి లో ఫలితాల లో అనంతపురం జిల్లా టాపర్ దీక్షిత్ కి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులు గుంతకల్లు ఎంఈఓ మస్తాన్ రావ్, మరియు సంఘ సేవకులు ఇస్మాయిల్ పాల్గొని మాట్లాడుతూ పిల్లలు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవి నపుడే ఇలాంటి ఫలితాలు వస్తాయి అని అలాగే మార్కులు ఎక్కువ వచ్చాయి అని గర్వం తలకు ఎక్కించు కోవడు అని ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అలవర్చు కున్నానాడే కన్న తల్లి దండ్రుల కే కాదు ఉన్న ఊరికే పేరు తెచ్చిన వరవుతామని సూచించారు.అనంతరం ఎంఈఓ మస్తాన్ రావ్ కి రెడ్ డ్రాప్ సభ్యులు సత్కరించా రు.ఈ కార్యక్రమం లో దీక్షిత్ తండ్రి మస్తాన్ రావ్, రెడ్ డ్రాప్ ఫౌండర్ రెహమాన్, ప్రెసిడెంట్ గులాం, మహమ్మద్, కోశాధికారి, మనోహర్, కరుణ్య హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ కాకుమాను బాలయ్య, రెడ్ డ్రాప్ సభ్యులు ఆకుల మురళి మోహన్, శివ కృష్ణ రావ్, టంగుటూరి రోషన్,బందారు అనిల్, రోట్రాక్ట్ ప్రెసిడెంట్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



**మే 4,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాట్యాచర్యులు గౌతమి మహేష్ శివార్పణం స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, చెన్నై వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుష్పాంజలి శ్రీ విఘ్న రాజం భజే అంటూ సాగే ఈ పాటతో మొదలై గణేష్ కవుతువం, అలరిప్పు, జాతీశ్వరం చక్రవాకం, శబ్దం, నాటకురుంజి వర్ణం, మూషిక వాహన, కోలాటం తదితెర పాటలకు కళాకారులు సాయి కీర్తన రాజన్, పూజా, యజ్ఞిని్శ్రీ, రజిత, నిహారిక, దివ్యదర్శిని, ధృతి, అభిరామి, పూజా రాణి, శ్రీయ, నిత్య శ్రీనివాసిని, యోవిః, సంగీత తదితెరలు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏ.ఓ.సుధాకర్ పర్యవేక్షించారు. అనంతరం ఏ.ఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు గౌతమి మహేష్, ఏ.ఈ రాధాకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి



**ప్రజా జ్యోతి తుగ్గలి** కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పటేల్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న రౌడీ శీటర్లకు నేరచరిత్ర గలవారికి చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జొన్నగిరి ఎస్సై ఎన్ సి మల్లికార్జున కౌన్సిలింగ్ నిర్వహించారు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండండి, అనంతరం జొన్నగిరి ఎస్సై ఎన్, సీ, మల్లికార్జున మాట్లాడుతూ, ప్రస్తుతం వారి జీవిస్తున్న విధానం జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న, మీపై నిరంతరం నిగా ఉంటుందని పోలీసులు మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జొన్నగిరి ఎస్సై ఎన్, సి, మల్లికార్జున కౌన్సిలింగ్ ఇచ్చారు.

## కళ్లాలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ రాహుల్.



**పోదూరు, మే 4,(ప్రజాజ్యోతి న్యూస్ :** పోడూరు మండలం జగన్నాథపురం గ్రామంలో అకాల వర్షం కారణంగా కళ్ళాలోని తడిసిన ధాన్యాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని, వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి రైతు సేవ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకా వర్షాలు కురవనున్న దృష్ట్యా టార్పాలిన్లతో ఉన్న ధాన్యం తడవకుండా చూడాలన్నారు. రైతులకు కావలసిన గోనె సంచులను రైతు సేవా కేంద్రాల ద్వారా తీసుకోవచ్చు అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ, వీఆర్వో, తదితరులు, సిబ్బంది ఉన్నారు.

## నరసాపురం పార్లమెంటు పరిశీలకులుగా పిల్లి సుభాష్ చంద్రబోస్

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్...** ప్రత్తిపాడు నియోజకవర్గం, రామచంద్రపురం వైఎస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాజ్యసభ సభ్యులు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ గారి ని నరసాపురం పార్లమెంట పరిశీలకులుగా నియమితులైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు %c% నరసాపురం పార్లమెంట పరిశీలకులు%c% ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు

కష్టపడి కాదు ఇష్టపడి చదివితేనే ఫలితం ఉంటుంది ఎంఈఓ మస్తాన్ రావ్

# ధాన్యం ఆఖరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. మంత్రి నిమ్మల.





**పోడూరు, మే 4,ప్రజాజ్యోతి న్యూస్ :** ధాన్యం దిగుబడులు బాగా పెరిగిన, ప్రైవేటుగా ధాన్యం ఎగుమతులు కాకపోయినా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని ఆఖరి గింజ వరకు రైతుల దగ్గర కొనుగోలు చేస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో పోడూరు మండలం జిన్నూరు, వేడంగి గ్రామాల్లో రూ.195.36 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున మంత్రి రామానాయుడుకు రైతులతో పాటు గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతు బిడ్డగా రైతు కష్టాలు, ఇబ్బందులు తనకు తెలుసునని రైతులకు మేలు జరిగే కార్యక్రమాలకే కూటమి ప్రభుత్వం తో పాటు తాను ప్రాధాన్యతనిస్తున్నానని తెలిపారు. నాడు రైతులు పండించిన ధాన్యం ను అమ్ముకోవాలంటే రైస్ మిల్లు వద్ద వారం రోజులు పడు గాపులు పడాల్సి వచ్చేదని నేడు కూటమి ప్రభుత్వంలో రైతులు ధాన్యమును నచ్చిన మిల్లుకు అమ్ముకోవడంతో పాటు 48 గంటల్లో బ్యాంకు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు.గత జగన్ ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన రూ 1654 కోట్ల ధాన్యం బకాయలను చంద్రబాబు చెల్లించారన్నారు.పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే కోటి నలభై ఐదు లక్షల సంచులు రైతులకు ఇచ్చామని,వాతావరణం దృష్ట్యా టార్గెట్ కంటే అదనంగా మరోక ముప్పై లక్షలు సంచులు ఈరోజు జిల్లా రైతులకు అందించమని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఐదేళ్లు రైతు కంట కన్నీరు పెట్టించిన జగన్ రైతుల గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లినట్లు అవుతుందన్నారు. ఇన్సూరెన్స్ ని కట్టడమే మర్చిపోయిన జగన్కు వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత ఎక్కడ ఉందన్నారు. జగన్ భూతాన్ని సీసాలో పెట్టి బిరడా బిగించామని మళ్లీ బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుందని ప్రజలంతా బయటికి రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. నాడు జగన్ విధ్వాంశం వైపు అడుగులు వేస్తే నేడు చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం దిశగా పాలన అందిస్తున్నారన్నారు. గత జగన్ ప్రభుత్వంలో చేసిన అప్పులను, వడ్డీలను చెల్లించడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు మంచి పాలన అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ గుర్తించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి రామానాయుడు కోరారు. అధికార మార్పిడి అభివృద్ధి వైపు ఉండాలి గాని విధ్వంసం వైపు కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కోడి విజయభాస్కర్, పితాని వెంకట్, పెనుమత్స రామభద్రరాజు, దేవల్ల రామకోటి మోహన్, ఎర్రంశెట్టి పద్మారావు, ఉన్నమట్ల కబర్ధి,కుక్కల సత్యనారాయణ, పాలవలస తులసిరావు, దూసనపూడి దొరబాబు, ఎర్రంశెట్టి నరసింహారావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

రైతుల ఆందోళన చెంద వద్దు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.



**పోడూరు, మే 4,ప్రజాజ్యోతి న్యూస్ :** ఆదివారం అకాల వర్షం కారణంగా కల్లాల్లో, రోడ్లు పక్కన ఆరబెట్టిన ధాన్యము తడిసి పోవడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆచంట గ్రామంలో పర్యటించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తగినన్ని గోనే సంచెలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. మిల్లర్స్ సహకరించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో తగినన్ని గోని సంచులు రవాణా సౌకర్యములు కల్పించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంలో ఆర్డీవో దాసిరాజు,తాహసిల్దారు జి.కనకరాజు, ఎంఏఓ నాగరాజు, విఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన ఎస్పీ,కలెక్టర్..





**బాపట్ల, మే 4 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ మహిళ కళాశాలను ఆదివారం జిల్లా కలెక్టర్ జే.వెంకట మురళి ఐఏఎస్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి లు సందర్శించారు. కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ యుజి పరీక్షా కేంద్రలను తనిఖీ చేశారు. అభ్యర్థి అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని, విద్యార్థులను తనిఖీ చేసే విధానాన్ని, సీసీ కెమెరాలు అనుసంధానించిన విభాగాన్ని పరిశీలించారు. అబ్జర్వర్లు, కోఆర్డినేటర్ల లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి విద్యార్థులకు చేసిన ఏర్పాట్ల గురించి, పరీక్ష విధానాల గురించి చర్చించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్ల గురించి పోలీస్ అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ మహిళ కళాశాలలో మొత్తం రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో మొత్తం 416 మంది విద్యార్థులను నేషనల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ టెస్ట్ రాయటానికి కేటాయించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎవరు గుంపులుగా సంచరించకుండా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 విధించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష సెంటర్ వద్ద డి.ఎఫ్.ఎమ్.డి లు, హెచ్.ఎచ్.ఎం.డి లు ఏర్పాటు చేసి ప్రతి ఒక్క అభ్యర్థిని బీడీ టీమ్ తో తనిఖీ చేయించడం జరిగిందన్నారు. హాల్ టికెట్ లు, అడ్మిట్ కార్డులు ఉన్న అభ్యర్థులను ఎగ్జామినేషన్ సెంటర్లోకి అనుమతించడం జరిగిందన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా కలెక్టర్ జే .వెంకట మురళి ఐఏఎస్ తో కలిసి అభ్యర్థి అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని, విద్యార్థులను తనిఖీ చేసే విధానాన్ని, సీసీ కెమెరాలు అనుసంధానించిన విభాగాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. అబ్జర్వర్లు, కోఆర్డినేటర్ల లతో విద్యార్థులకు చేసిన ఏర్పాట్ల గురించి, పరీక్ష విధానాల గురించి చర్చించడం జరిగిందన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం పేపర్లను తరలించేందుకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను ఏర్పాటు చేశామన్నారు.

## ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్షలు ..

## జిల్లా కలెక్టర్ వెంకట మురళి..



**బాపట్ల, మే4 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ను (నీట్ యు. జి. 2025) ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఆదివారం,నీట్ యు.జి.పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. చీరాల యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ యూజీ 2025 పరీక్షా కేంద్రాలకు ఆయన చేరుకుని భద్రతా ఏర్పాట్లను, పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏర్పాటుచేసిన గదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క గదికి 24 మంది విద్యార్థుల చొప్పున కేటాయించడమైనదని అన్నారు. యార్లగడ్డ అన్నపూర్ణంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో 240 మంది విద్యార్థులను కేటాయించగా, హాజరు, గైర్హాజర్ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. 235 మంది విద్యార్థులు హాజరుకాగా, 5 మంది గైర్హాజరైనట్లు, అదేవిధంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో 176 మంది విద్యార్థులను కేటాయించగా 169 మంది విద్యార్థులు హాజరయ్యారని 7 మంది గైర్హాజరు అయినట్లు ప్రధాన ఆచార్యులు ఆయన దృష్టికి తెచ్చారు. నీట్ యూజీ పరీక్షా సరళి ని అయన అడిగి తెలుసుకున్నారు. పరీక్ష ముగిసిన తర్వాత తీసుకునే చర్యలపై ఆయన అధికారులను ఆరా తీశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగలేదని, ప్రశాంత వాతావరణంలో నీట్ యు. జి పరీక్ష జరిగిందని,అధికారులు పకడ్బందీగా పరీక్షను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పి తుషార్ డూడి, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు మరియు నీట్ యూజీ నోడల్ అధికారి మృదుల, చీరాల తాసిల్దార్ గోపాలకృష్ణ, డి ఎల్ డి ఓ పద్మావతి, కళాశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

# ఉచిత నైపుణ్య శిక్షణ మరియు ఉద్యోగ అవకాశాల మేళా




**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** శృంగవరపుకోటలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో ఉచిత నైపుణ్య శిక్షణ మరియు ఉద్యోగ అవకాశాల మేళాలిను 04-05-2025 (ఆదివారం) నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లి%ాజుజుణూ్రా% ఆధ్వర్యంలో, విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ మతుకుమిల్లి భరత్ గారు మరియు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ గొంప క్రిష్ణ గారి నేతృత్వంలో నిర్వహించబడింది. ఈ మేళాలో 200 మంది యువతీ యువకులు పాల్గొనగా, 103 మందిని వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ (ట్రైనింగ్) కోసం ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గొంప కృష్ణ గారు మాట్లాడుతూ: వికాసానికి విద్యే బాట. యువత నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తేనే సుస్థిర భవిష్యత్తు సాధ్యం. రాష్ట్రంలో యువత ఉద్యోగావకాశాలు పొందాలంటే, ఇటువంటి శిక్షణలు కీలకం. టీడీపీ ప్రభుత్వం ఉద్యోగ కల్పనకు కట్టుబడి ఉంది వంటి సంస్థల సహకారంతో ఇంకా ఎక్కువ శిక్షణ శిబిరాలు, మేళాలు నిర్వహిస్తాం.నైపుణ్యం ఉన్న ప్రతి యువకుడికి దేశంలో మంచి స్థానం ఉంటుంది. మీరు అవకాశాలను ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి అల్లా (జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్(%ాజుజుణూ్రా%),టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవి కుమార్ (జామి టీడీపీ మండలం పార్టీ అధ్యక్షులు), జుత్తాడ రామసత్యం (శృంగవరపుకోట మండల పార్టీ సెక్రటరీ),గుమ్మడి వానిభారతి (నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు), ఆడారి రమేష్ (%ూ%.కోట టౌన్ చీఫ్ సెక్రటరీ), వివేకానంద కాలేజీ కరెస్పాండంట్ ప్రసాద్ గారు ,ఇప్పాక త్రివేణి (జామి మేజర్ పంచాయతి మాజీ సర్పంచ్), మాదిబోయిన మంగరాజు(%ూ%.కోట టౌన్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు),గనివాడ సన్యాసి నాయుడు (వినాయకపల్లి సర్పంచ్), కోరుకొండ శ్రీనివాస్ రావు(వాసి మాజీ సర్పంచ్), మరియు శృంగవరపుకోట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయుకులు పాల్గొన్నారు.

## ఏకత్వ పాఠశాలలో

## ఘనంగా స్విమ్మింగ్ పూల్ ప్రారంభం



**వీరులపాడు, మే 04 - ప్రజాజ్యోతి** స్విమ్మింగ్ అనేది ఒక సామాజిక క్రీడ. ఇది ఫిట్‌నెస్, కండరాల బలం, శ్రేయస్సును పెంచడానికి సహాయపడుతుందని నందిగామ లోని ప్రముఖ విద్యావేత్త అమరనేని రమేష్ బాబు అన్నారు. వీర్లపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వ పాఠశాలలో జాతీయ ప్రామాణాలతో కూడిన ఈతకొలను స్విమ్మింగ్ పూల్ ను ఆదివారం ఉదయం అమరనేని రమేష్ బాబు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ స్విమ్మింగ్ మొత్తం శరీరాన్ని వ్యాయామం చేస్తుందని ఇది ఫిట్‌నెస్ స్థాయిని మెరుగుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ డైరెక్టర్స్ అమరనేని మనోజ్, కార్తీక్, శాంతి, పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు ఐశ్వర్య సాంబశివన్, వ్యాయామ విద్య విభాగాధిపతి విజయ్ కుమార్ గోగులమూడి, పాఠశాల ఇంచార్జ్ గ్రంధి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు బ్రహ్మం కోనేటి, ప్రసన్న, సుమలత, భవాని, విద్యాధరి, గాయత్రి, శివరాం ప్రసాద్, సైదా, హేమంత్ పాఠశాల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి

## నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.

**పలు గ్రామాలలో విద్యుత్తుకు అంతరాయం.**



**పాలకొల్లు. ప్రజాజ్యోతి (కొట్టి రామం ) మే. 4.** పాలకొల్లు నియోజకవర్గం లోని పలు గ్రామాలలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవటంతో రోడ్లపై పలు చోట్ల చెట్లు,విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీనితో
పలు గ్రామాలకు విద్యుత్తుకు అంతరాయం కలిగింది. మసూలు చేసి ఆరబెట్టటానికి ఉంచిన ధాన్యం రాశులు తడిచిపోవటంతో రైతులు దిగులు చెందుతున్నారు.

## భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న యువనేత పవన్ గౌడ్



**గుంతకల్లు మే 4 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని సగర ఉప్పర సంఘం పెద్దలు ఆదివారం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, యువనేత పవన్ గౌడ్ ఈ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని భగీరథ మహర్షికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్రేయోభిలాషుల ఆహ్వానం మేరకు వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేయ డం జరిగింది. ఈ కార్యక్రమం లో పార్లమెంట్ కురువ సంఘం అధ్యక్షులు కురువ చంద్రశేఖర్,నియోజవర్గం ఓటర్ వెరిఫికేషన్, 1వార్డు ఇంచార్జి ముక్కన్న గారి రామాంజనే యులు,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## 18 కేజీలు గంజాయి పట్టివేత



**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** 4-5-2025 నా ఉదయము సుమారు 8 గంటల సమయం లో ఎస్. కోట పోలీసు వారికి వచ్చిన పందిరప్పన్ నమ్మకమైన సమాచారము మేరకు పందిరప్పన్న జంక్షన్ వద్దకు చేరుకుని వాహనములు తనిఖీ చేస్తుండగా %ఖూ 02ఖూ%8368 నంబర్ గల రెడ్ కలర్ మాక్సిమో ప్లస్ హౌస్ %శీశ్రీుస% ఫర్నిచర్ కలిగి ఉన్న వాహనాన్ని ఆపి తానిఖీ చేయగా, ఫర్నిచర్ బెడ్ లోపల 9 ప్యాకెట్లు లో ప్యాక్ చేసినా 18 కిలోలు గంజాయి ఉంది. అంతటా ఆ వాహనాన్ని డ్రైవ్ చేసిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరియ అరుళ్, కేరళ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఒడిస్సా నుండి గంజాయి రావణ చేస్తున్నట్లు చెప్పగ %౦%. కోట పోలీస్ వారు సదరు వ్యక్తి ని వాన్ ను మరియూ అతని వద్ద నుండి గంజాయి స్వాధీనపరుచుకుని కేసు నామోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి హామీ పథకం ఈ సి గా రాజశేఖర్



**ప్రజా జ్యోతి తుగ్గలి** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తుగ్గలి మండల ఇన్చార్జి కన్సల్టెంట్ ఇంజనీర్ ( ఈసీ) గా రాజశేఖర్ ను నియమిస్తూ జిల్లా ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తుగ్గలి లో పనిచేస్తున్న ఇంచార్జి కన్సల్టెడ్ ఇంజనీర్ ప్రదీప్ కుమార్ పత్తికొండ మండలానికి బదిలీ పై వెళ్లడంతో ఇక్కడే పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ కు అదనంగా ఇన్చార్జి కన్సల్టెంట్ ఇంజనీరుగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కన్సల్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ పథకం శ్రామికులకు వేతనాలు సక్రమంగా సకాలంలో అందే విధంగా ఉన్నతాధికారులు, స్థానిక అధికారుల సూచనలు, సలహాలతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానని ఆయన తెలిపారు. అందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## చిన్న జొన్నగిరి గ్రామంలో కళాకారులకు తప్పెట్ల ఉచితంగా పంపిణీ




**ప్రజా జ్యోతి తుగ్గలి** మండల పరిధిలోని చిన్న జొన్నగిరి గ్రామంలో ఆదివారం కళాకారులకు తప్పెట్లను ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కా పకీరప్ప ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి మండలం, లచ్చాను పల్లె గ్రామానికి చెందిన కళాకారులకు తాను ఉచితంగా తప్పెట్లను పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. త్వరలో మరికొన్ని గ్రామాలలోనే కళాకారులకు తప్పెట్లను ఉచితంగా పంపిణీ చేస్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నేతలు బోయ రామాంజనేయులు, బోయ వీరేష్ ,ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు ఆవుల రాము, ఇమ్రాన్, సతీష్ బాబు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

### గుంతకల్లు టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లీమీన్ కమిటీ అధ్వర్యంలో

# హాజరత్ టిప్పుసుల్తాన్ గారి 226వ వర్ధంతి వేడుకలు.




**గుంతకల్లు మే 4 (ప్రజాజ్యోతి):** ఆంగ్లేయవలస పాలకుల పాలిట సింహ స్వప్నంగా నిలిచిన మైసూర్ పులి టీపూ సుల్తాన్ మే 4న 226వ వర్ధంతి సందర్భంగా గుంతకల్లు పట్టణంలోని టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లీమీన్ కమిటీ (టి ఐ ఎం) అధ్వర్యంలో కార్యాలయంలో ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ తొలి స్వతంత్ర సమరయోధునిగా ప్రాణాలు అర్పించిన అమరుడు టిప్పు సుల్తాన్ ఆయన రాజ్యంలో అత్యున్నత పదవులు బ్రాహ్మణులు కట్టబెట్టడం మరియు లౌకిక వాదానికి మతసామరస్యానికి ప్రతీకగా ఉంది మసీదుకు మందిరా నికి మధ్య తేడా లేకోకుండా అన్ని వర్గాల వారికి సమాన పాలన సమన్యాయం కొనసాగించారు. మొట్ట మొదటిసారిగా ఆంగ్లేయుల ఉనికిని మనుగడను గ్రహించి వారిని అడ్డగించిన తొలి భారతీయ రాజుగా పేరు ఆయన చేసిన సంస్కరణ లను రాకెట్ ఆవిష్కరణ మిస్సైల్ ,ఫిరంగి భూసంస్కర ణలు మరియు అనేక హిందూ దేవాలయాలకు శరణా శరణాలయాలతో మఠాలకు విరాళాలు అందించి నిర్మాణాలకు సహకరించడం ఆయన రాజ్యంలో మతసామర స్యానికి అద్దం పడుతుంది. అటువంటి మహోన్నత వ్యక్తికి నేటికీ కూడా 200 సంవత్సరాల పైన ఆయన పేరు చరిత్రలో చెప్పుకోవడం గమనించదగ్గ విషయం ఆయన చరిత్రను వక్రీకరించ డం ఇప్పుడు ఉండే పాలకులకు మింగుడు పడక ఆయన చరిత్రను తొలగించ డం కూడా జరిగింది. కానీ ఇటువంటి అమరులు మరియు మహోన్నత వ్యక్తులు అమరులై ఉంటారు స్మరిస్తూ టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లీమీన్ కమిటీ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలందు చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లీమీన్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండిఆర్ ఖలీల్,జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం మౌలా,పట్టణ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, కోశాధికారి పఠాన్ దాదాఖాన్,పట్టణ కార్యదర్శి షేక్ ఇమ్రాన్, పట్టణ మాజీ అధ్యక్షులు దాదా ఖలందర్,గౌరవ అధ్యక్షులు మసూద్,సద్దాం హుస్సేన్, లెజెండ్ రంజాన్, సలహాదారులు అక్రమ్ భాష,సహాయ కార్యదర్శి సిలార్ శిక్షావలి, మరియు సభ్యులు ఆయుర్ భాష,రెక్సిన్ గౌస్,కాజా, అబ్దుల్ బాసిత్ దస్తగీర్, నౌషాద్ అలీ,అయజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని వైయస్సార్సీపిని శాశ్వతంగా సాగనంపండి.





**కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తుంది సాయం.**

**రూ.195.36 లక్షల అభివృద్ధి పనుల శంకుస్థాపనలలో మంత్రి నిమ్మల రామానాయుడు.**

**పాలకొల్లు ప్రజాజ్యోతి (కొట్టి రామం )** మే 4. రైతులను పట్టించుకోని వైయస్సార్ పార్టీని శాశ్వతంగా సాగానంపాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకుఅన్నివిధాలా సాయం చేస్తున్నదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో పోడూరు మండలం జిన్నూరు, వేడంగి గ్రామాల్లో రూ. 195.36 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున మంత్రి రామానాయుడుకు రైతులతో పాటు గ్రామస్తులు స్వాగతం పలికారు. మహిళలు పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రైతు బిడ్డగా రైతు కష్టాలు, ఇబ్బందులు తనకు తెలుసునని రైతులకు మేలు జరిగే కార్యక్రమాలకే కూటమి ప్రభుత్వం తో పాటు తాను ప్రాధాన్యతనిస్తున్నానని తెలిపారు. నాడు రైతులు పండించిన ధాన్యం ను అమ్ముకోవాలంటే రైస్ మిల్లు వద్ద వారం రోజులు పడు గాపులు పడాల్సి వచ్చేదని...నేడు కూటమి ప్రభుత్వంలో రైతులు ధాన్యమును నచ్చిన మిల్లుకు అమ్ముకోవడంతో పాటు 48 గంటల్లో బ్యాంకు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు.గత జగన్ ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన రూ 1654 కోట్ల ధాన్యం బకాయలను చంద్రబాబు చెల్లించారన్నారు.పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే కోటి నలభై ఐదు లక్షల సంచులు రైతులకు ఇచ్చామని,వాతావరణం దృష్ట్యా టార్గెట్ కంటే అదనంగా మరోక ముప్పై లక్షలు సంచులు ఈరోజు జిల్లా రైతులకు అందించమని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఐదేళ్లు రైతు కంట కన్నీరు పెట్టించిన జగన్ రైతుల గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లినట్లు అవుతుందన్నారు. ఇన్సూరెన్స్ ని కట్టడమే మర్చిపోయిన జగన్ కు వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత ఎక్కడ ఉందన్నారు. జగన్ భూతాన్ని సీసాలో పెట్టి బిరడా బిగించామని... మళ్లీ బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుందని ప్రజలంతా బయటికి రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. నాడు జగన్ విధ్వంసం వైపు అడుగులు వేస్తే నేడు చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం దిశగా పాలన అందిస్తున్నారన్నారు. గత జగన్ ప్రభుత్వంలో చేసిన అప్పులను, వడ్డీలను చెల్లించడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు మంచి పాలన అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ గుర్తించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి రామానాయుడు కోరారు. ధాన్యం దిగుబడులు బాగా పెరిగిన, ప్రైవేటుగా ధాన్యం ఎగుమతులు కాకపోయినా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని ఆఖరి గింజ వరకు రైతుల దగ్గర కొనుగోలు చేస్తుందని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు నియోజకవర్గం టీడీపీ నాయకులు కోడి విజయభాస్కర్ పితాని వెంకట్ పెనుమత్స రామభద్రరాజు వేడంగి సర్పంచ్ సి హె చ్ పి పి శారద ఎంపీటీసీలు వై వి నర్సింహారావు దూసనపూడి దొరబాబు టీడీపీ నాయకులు కె సత్యనారాయణ రాజు బాలం పురుషోత్తం కొండేటి ప్రసాద్ బొలిశెట్టి మంగయ్య నాయుడు దూబా వెంకటేశ్వర రావు మేడిశెట్టి బుజ్జి కుక్కల మునీంద్రరావు కొండేటి యజ్ఞనారాయణ బిజెపి నాయకులు యర్రంశెట్టి పద్మారావు ఉన్నమట్ల కబర్ది జనసేన నాయకులు బొలిశెట్టి రమేష్ కొర్రకూటి హరి జిన్నూరు టీడీపీ నాయకులు దేవళ్ల ప్రసాద్ దేవళ్ళ రామకోటి మోహన్ కుక్కల సత్యనారాయణ పాలవలస తులసిరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కుల మీద

# ఉక్కు పాదాన్ని మోపడాన్ని వ్యతిరేకించండి

**ఐఎఫ్టియు అనంతపురం నగర కమిటీ ఎన్నిక**




**అనంతపురం మే 4 (ప్రజా జ్యోతి):** ఆదివారం అనంతపురం పట్టణంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య( ఐఎఫ్టియు ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర పునర్నిర్మాణ కమిటీ కోసం జనరల్ బాడీ సమావేశాన్ని ఎన్జీవో కాంపౌండ్ లోని పెన్షనర్ల భవన్లో నిర్వహించ డం జరిగినది. ఈ సమావేశా నికి అధ్యక్షులుగా ఐ ఎఫ్ టి యు నాయకులు ఎర్రి స్వామి వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు బి, సురేష్ యేసు రత్నం పాల్గొని మాట్లాడుతూ ఐఎఫ్టియు విప్లవ కార్మిక సంఘం అనేక రాష్ట్రాలలో కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్నది. సంఘీడిత,అసంఘటిత కార్మికులను సమీకరించి వారి పక్షాన నిలబడుతూ వారి సమస్యల మీద నిరంతరం పోరాడుతున్నదని ముఖ్యం గా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదార వర్గాలకు బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ల ను తీసుకురావడం జరుగుతు న్నది. దీని ఫలితంగా కార్మికులు అనేక సంవత్సరా లుగా పోరాడి సాధించుకున్న హక్కులు నిర్వీరమయ్యే పరిస్థితి ఏర్పడినది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుండటంతో వాటిలో పని చేసే ఉద్యోగులు కార్మికులు అభద్రత భావంతో జీవించడం జరుగుతున్నది. లేబర్ కోడ్ల కు వ్యతిరేకంగా ఈనెల 20వ తారీఖున కార్మిక సంఘాలన్నీ కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగినది. ఈ సమ్మెలో లక్షలాదిమంది కార్మికులు వీధుల్లో కొచ్చి తమ నిరసనను కేంద్ర ప్రభుత్వం పైన తెలపడం జరుగుతుంది. సమ్మె కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుచున్నాము. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నిలబెట్టుకోవా లంటే నిరంతరం పోరాటాలు చేయడం ద్వారానే కార్మికులు తమ హక్కులను నిలబెట్టు కుంటారని తెలుపుతున్నా ము. ఇప్పుడు ఏర్పాటు అయ్యే ఐ ఎఫ్ టి యు నగర కమిటీ భవిష్యత్తులో బలమై న కార్మిక ఉద్యమాలు నిర్మించే శక్తిగా తయారవు తుందని పిలుపునివ్వడం జరిగినది. ఐఎఫ్టియు నగర కమిటీ 17 మందితో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగినది. అరుణోదయ సాంస్కృతిక సంస్థ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప పాటలు పాడి మాట్లాడడం జరిగినది. ఐఎఫ్టియు నగర కమిటీ అధ్యక్షులు దావీద్, ఉపాధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి ఎర్రి స్వామి, సహాయ కార్యదర్శి సురేష్, కోశాధికారి రామిరెడ్డి .కమిటీ సభ్యులు సాంబ,లింగమయ్య ,నరసప్ప,ఈశ్వరయ్య,తిరుపాల్,నాగిరెడ్డి,నాగరత్నమ్మ,వరలక్ష్మి, నాయుడు,భాష,నాగభూషణం,లక్ష్మీనారాయ,మరో ఇద్దరు మహిళలను కో ఆప్షన్ గా తీసుకోవాలని తీర్మానించడం జరిగినది.

# దాతల దాతృత్వం





- అమ్మవారి పండుగకు క్షేత్రస్థాయిలో విరాళాల సేకరణ
- రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ
- విస్తృతంగా విరాళాలు అందిస్తున్న దాతలు

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పిలిస్తే పలికే తల్లి కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పొందూరు పైడితల్లి పండుగ నిర్వహణలో దాతలు ఆర్థిక సహాయం అందజేస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. 15 ఏళ్ళ తర్వాత గ్రామంలో జరిగే పండుగను ఆనందవంతంగా , సమర్థవంతంగా ఎటువంటి ఆటంకాలు , ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పట్టణ వాసులు తమ వంతు సహకారాన్ని అందజేస్తున్నారు. గత రోజులుగా పండగ కమిటీ సభ్యులు చేపడుతున్న ఈ విరాళాలు సేకరణ కార్యక్రమానికి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుంది.ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీ పొందూరు మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి నాల్గవ ఎంపీటీసీ బాడాన హారిక దంపతులు రూ. 50 వేలు , వైసిపి మాజీ ఏ.ఎం.సి చైర్మెన్ బాడాన సునీల్ బ్రదర్స్ రూ. 20 వేలు తో పాటు పలువురు దాతలు తమ వంతు సహకారంగా ఆర్థిక సహాయాన్ని పండుగ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ ,ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి మాట్లాడుతూ 15 ఏళ్ళ తరువాత పొందూరు తో పాటు ఆరు గ్రామాలు కలిసి జరుపుకుంటున్న అమ్మవారి పండుగ సేవలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. భారీ స్థాయిలో పండుగ జరిపించేందుకు పండుగ కమిటీ సభ్యులు ప్రణాలికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు.ఏడు గ్రామాల ప్రజలు తమ వంతు సహకారాలను అందించేందుకు ముందుకు రావాలన్నారు. చేయి చేయి కలుపుకుని ఐకమత్యంతో పండుగ దిగ్విజయంగా జరుపుకునేందుకు ముందుకు వస్తున్న ప్రతీ ఒక్కరినీ అభినందించారు.ఈ కార్యక్రమంలో రాంబిల్లి నాగరాజు ,అనకాపల్లి శ్రీనివాస రావు , మొకర సత్యన్నారాయణ ( ఎం.ఎస్.ఎన్ ) రిటైర్డు ఉపాధ్యాయులు కోరుకొండ విజయ్ కుమార్, , గుడ్ల మోహన్, గాడు నాగరాజు , కాలెపు శ్రీనివాస రావు ,దండా రవికుమార్, గుంటుకు రాము , యర్రా సతీష్ , ఆ నేం పాపారావు ,పట్నాన శ్రీనివాస రావు ,ఎం.ఈ. ఓ 2 పట్నాన రాజారావు , మల్లిక భుజంగ రావు , రాయిపిల్లి రాంబాబు ,గిడిజాల భాస్కర రావు ,అనకాపల్లి చిన్న , అనకాపల్లి భవాని , కాకర్ల సాయి , ఏ టి ఏం శ్రీను ,జరజాపు గణేష్ తదితర పండుగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కడప ఉక్కు కు నిధులు ఎక్కడ - పనులు ఎక్కడ

మోడీ మరోసారి మాటలతో ఆంధ్రులను మోసం చేశారు
డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని



**బద్వేల్ మే 4 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆంధ్ర రాష్ట్రానికి వచ్చినటువంటి ప్రధాని నరేంద్ర మోడీ గారు కడప ఉక్కు అలాగే కొప్పర్తి ప్రస్తావన సరే వాటికి నిధులు కేటాయించకుండా పనులు చేపట్టకుండా పనులు ప్రారంభంపై స్పష్టత ఇవ్వకపోవడం మరో మారు కడప జిల్లాకు మొండి చెయ్యి చూపించడమే అని అలాగే ఆంధ్ర ప్రజలను మరో మారు మాటలతో మోసం చేశారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం ఉదయం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్. ఎస్ కే ఆదిల్. ఉపాధ్యక్షులు యువరాజ్ లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ.... ఈనెల రెండవ తేదీ శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండవసారి రాజధాని నిర్మాణం కోసం శంకుస్థాపన దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు మరో మారు శంకుస్థాపన లు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు బూటకపు మాటలు చెప్పారని తీవ్రంగా విమర్శించారు గత 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నుండి నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇచ్చామని బహిరంగ సభలో దేశ ప్రధాని అబద్ధాలు చెప్పారని నిజానికి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు కట్టిన టాక్స్ లలో 50% పైగా రాష్ట్ర వాటాగా రావాల్సిన నిధులు కూడా సక్రమంగా ఇవ్వలేదని అవాస్తవాలు ప్రజలకు చెప్పారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లోకేష్ లు ఖండించలేదని వారు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి ప్రస్తావన చేశారని కానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పనులు ఎప్పుడు చేపడుతారో నిధులు ఎంత కేటాయిస్తారో చెప్పలేదన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ కు వచ్చిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను 300 కోట్ల రూపాయలు నిధులు ఆర్ జి బి బ్యాంకును విజయవాడకు తరలించుకొని పోయారని రాయలసీమ అభివృద్ధిని అంతా రాజధానికి తరలిస్తున్నారని పూర్తిగా మాయమాటలు మాట్లాడాలని వారు ఎద్దేవా చేశారు. 5000 ఎకరాలలో రాజధాని నిర్మాణానికి సరిపోతుందని రాజధాని నిర్మాణ నిపుణులు ఒకపక్క తెలియజేస్తూ ఉంటే 34 వేల ఎకరాలు సేకరించారని ఇది ఎవరి ప్రయోజనాల కోసం అనేది అనుమానంగా ఉందని రైతులు చేసిన త్యాగాలు వారిచ్చిన భూములు కార్పొరేట్ సంస్థలకు బడా పారిశ్రామికవేత్తలకు అధికార పార్టీ మంత్రులకు ప్రభుత్వ అనుకూల వ్యాపారవేత్తలకు కారు చౌకగా కట్టపెట్టేందుకే ఇంత పెద్ద ఎత్తున భూసేకరణ చేశారని వారు ఆరోపించారు. గతంలో ఇదే సీఎం ఇదే ప్రధానిని పిలిపించి శంకుస్థాపన అటహాసంగా రాజధాని పైరస్ ప్రారంభించిన ఆర్థిక సహాయ ఊసే ఎత్తలేదని గుర్తు చేశారు. నాడు పిడికెడు మట్టి చెముడు నీళ్లు తప్ప ప్రధాని రాష్ట్రానికి ఏమి నిధులు విదిలించలేదని ఈ విషయాలు బాబు మరిచారా అని వారు ప్రశ్నించారు. మోడీ నాయకత్వంలోని బిజెపి ఎన్డీఏ ప్రభుత్వాలు మరోసారి మాయ మాటలతో అబద్ధాలతో ఆంధ్రులను మోసం చేశారని వారన్నారు అప్పులు తెచ్చి రాజధాని నిర్మిస్తే వడ్డీతో సహా ప్రజలపై భారాలు పడతాయని ఇప్పటికే ప్రజలపై మోయలేని టాక్స్ లు పన్నులు కరెంటు బిల్లులు సేవా బిల్లులు రకరకాల పేరిట మోపెడు భారం ప్రజలపై మోయ లేనంతగా వేశారని మూలిగే నక్కపై తాటికాయపడిన చందంగా పాలకులు ప్రజలను రక్షించాల్సింది పోయి భక్షిస్తున్నారన్నారని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకు దిగజారి పోతుందని పౌష్టికాహార లోపాలు పెరుగుతాయని వారన్నారు. అనేక రూపాలలో వివిధ రకాల పన్నుల పేరిట ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఇది కాకుండా భవిష్యత్తులో రాజధాని నిర్మాణ అప్పులు వడ్డీల ఖర్చులు ప్రజలపై వేసి వసూలు చేయిస్తున్నారని వారు ప్రధాని మోడీ చర్యలను తీవ్రంగా ఖండించారు.

# వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించిన కలెక్టర్ పి.ప్రశాంతి



**తూ.గో.జిల్లా,తాళ్లపూడి మండలం,మే4, ప్రజాజ్యోతి న్యూస్** ఈదురు గాలులు వలన ప్రమాదకర హోర్డింగ్ తొలగింపు లో అధికారులు సమన్వయం తో వ్యవహరించాలని నదీ తీరంలో ఉన్న గ్రామ పంచాయతీ అధికారి, కార్యదర్శి అప్రమత్తంగా ఉండాలి నదీ తీరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అకాల వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో కోతలు పూర్తి చేసిన ధాన్యం సేకరణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆదివారం జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులతో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానికంగా నీట్ పరీక్షలు కేంద్రాలను తనిఖీ చేసే క్రమంలో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 216 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రస్తుత రబీ సీజన్లో 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంలో ఇప్పటి 2,63,076 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి, లక్ష్యాలనుఅధిగమించడం జరిగిందన్నారుజిల్లాలో ఇప్పటి వరకు 2,79, 689 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి చెయ్యడంజరిగిందన్నారు. అనపర్తి నియోజక వర్గంలో 25,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి కాగా 17,903 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చెయ్యడం జరిగిందన్నారు. అదే విధంగా గోపాలపురం లో 32,105 ఎమ్ టి లకు, 30,038 ఎమ్ టి లు , గోకవరం మండలం లో 8758 ఏం టి లకు 8,637 ఎమ్.టీ లు , కొవ్వూరు పరిధిలో 70,479 కి 67,928 ఎమ్ టి లు , నిడదవోలు లో 89,099 ఎమ్ టి లకు గాను 86,054 మెట్రిక్ టన్నులు , రాజమహేంద్రవరం రూరల్ లో 14,782 ఎమ్ టి లకు గాను 14,605 ఎమ్ టి లు , రాజానగరం మండలం పరిధిలో 38,641 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి కాగా వాటిలో 37,911 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చెయ్యడం జరిగిందని తెలిపారు. ఇంకా కోతలు పూర్తి చేసిన వాటిలో 16,613 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా తగిన సూచనలు ఇవ్వడం, మిల్లులకు తరలించడం పై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు.తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్స్ విషయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారునిర్దేశించిన స్నాన ఘట్టాలలో స్నానాలు చేయడం కోసం మాత్రమే అనుమతించాలని, ప్రమాద ఘటనలు నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరీ తీరం లో ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్తి అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇటీవల గోదావరి నదిలో మునిగి మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. అటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. అందుకు సంబంధించి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈసమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్డీవోలు జిల్లా అధికారులుతాసిల్దారులు మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ఐ చర్చి స్త్రీల మైత్రి ఎన్నికలలో వీరదాసరి వసుంధర పాల్ ఘనవిజయం.



**బద్వేల్ మే 4 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేలు సిఎస్ఐ సెయింట్ పాల్ టౌన్ చర్చ్ స్త్రీల మైత్రి ఎన్నికలలో వీరదాసరి వసుంధర పాల్ ఘన విజయం సాధించారు. ఆదివారం సాయంత్రం బద్వేలులోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చిలో స్త్రీల మైత్రి ఎన్నికలు జరిగాయి. 50 మంది ఓటర్లు ఉండగా వీరదాసరి వసుంధర పాల్, కరాటి సంపూర్ణ ఎన్నికలలో పోటీపడ్డారు. అత్యంత ఆసక్తికరంగా జరిగిన ఎన్నికలలో వీరదాసరి వసుంధర పాల్ 35 ఓట్లు సాధించి ఘన విజయం పొందగా, కరాటి సంపూర్ణ 14 ఓట్లు సాధించారు. ఒక్క ఓటు చెల్లుబాటు కాలేదు. దాదాపు 20 సంవత్సరాలనుండి ఎప్పుడూ స్టీలమైత్రి కి ఎన్నికలు జరగలేదు,. ఓటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకునేవారు. సీఎస్ఐ చర్చిలో ప్రస్తుతం అధికారంలో కొనసాగుతున్న పాలకవర్గం కరాటి సంపూర్ణను పోటీలో నిలబెట్టగా, గతంలో అధికారంలో కొనసాగి, ప్రస్తుతం ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న వర్గం వీరదాసరి వసుంధర పాల్ ను పోటీలో నిలిపింది. జూలై మాసంలో ఫాస్ట్రేటు కమిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. అనంతరం స్త్రీల మైత్రి ట్రెజరర్ గా పెద్దీటి రోజీ పార్వతి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా సెక్రటరీ, ట్రెజరర్ గా ఎన్నికైన వీరదాసరి వసుంధర పాల్, పెద్దిటి రోజి పార్వతి మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించిన స్త్రీల మైత్రి సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మూడేళ్ల కాలంలో సంఘంలో స్త్రీల మైత్రిని అభివృద్ధి చేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా సాంప్రదాయంగా వస్తున్న ఏకగ్రీవ ఎన్నిక పద్ధతికి ఈసారి తిలోదకాలిచ్చి కోటికి నిలిపినప్పటికీ సంఘ సభ్యులు తమను ఆదరించడం గర్వంగా ఉందన్నారు.

## రైతులకు వర్షాలు దృష్ట్యా పలు సూచనలు చేసిన జిల్లా వ్యవసాయ అధికారి



**తూ.గో.జిల్లా,తాళ్లపూడి మండలం,మే4, ప్రజాజ్యోతిన్యూస్** రైతుసోదరులు ముఖ్యముగా వరికోతలు కోస్తున్న వారు ప్రస్తుత వాతావరణము దృష్టిలో పెట్టుకొని ఈక్రింది జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు కల్లల్లో ఉన్నఉన్న ధాన్యాన్ని వెనువెంటనే సురక్షిత ప్రదేశానికి తరలించాలని ఇప్పటివరకు జిల్లాలో 87% కోతలు పూర్తి చేయుట జరిగినది13% కోతలకు సిద్ధముగా ఉన్న , మిగిలిన 8500 %ఝ% లు, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాత్కాలికంగా ఆపాలనీ కోరారు. ముఖ్యముగా గోపాలపురం , తాళ్లపూడి, రంగంపేట, కడియం మండలాల్లో ఇంకా 25 నుండి 30% వరకు అధిక విస్తీర్ణం లో కోతల (%ఝతీజవర్%) కు సిద్ధముగా ఉన్న వారిని కోయటం నిలుపుదల చేయాలనీ రైతులకి విజ్ఞప్తి చేశారు

## రోడ్డుప్రమాదంలోయువకుడు మృతి



**బద్వేల్ మే 4 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ నియోజకవర్గం లోని కాశినాయన మండలం బసనపల్లి గ్రామ సమీపంలో టాటా ఏసీ వాహనం బోల్తాపడి సింహాద్రి అనే 17 సంవత్సరాల యువకుడుమృతిచెందారు. కాశినాయనమండలం నాయుని పల్లి గ్రామంలో ఓ పంక్షన్ కు పోరుమామిళ్ళ పట్టణంలోని ప్రభు సప్లేయర్స్ కూలీగా పనిచేస్తున్న రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన సింహాద్రి తన యజమాణితో కలిసి టాటా ఏసీ వాహనం లో సప్లేయర్స్ సామాన్లు దింపి వస్తుండగా బసనపల్లి దగ్గరలోని మలుపులో టాటా ఏసి నడుతున్న యజమాని కంట్రోల్ చేయలేక బోల్తాకొట్టారు. ఈప్రమాదం లో సింహాద్రి అక్కడికక్కడే మృతి చెందారు. దీంతోరెడ్డికొట్టాలలో విషాదఘటన చోటుచేసుకుంది. కృష్ణా రెడ్డి, తంగెళ్ల శేఖర్ కుగాయాలయ్యాయి. వారిని మృతుడిని పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాశినాయన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు.

## వైభవంగా కొత్తమ్మ తల్లి సంబరాలు

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- ముగ్రాటలతో మ్రొక్కులు చెల్లించుకున్న మహిళలు




**రణస్థలం ,ప్రజా జ్యోతి న్యూస్ :** రణస్థలం మండల ప్రజల ఆరాధ్య దైవం ,కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కొత్తమ్మ తల్లి సంబరాలు రణస్థలం మండలకేంద్రంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు , స్థానిక సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నాడు అంగరంగ వైభవంగా జరిగాయి. వానలు సమృద్ధి గా పడి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ వేడుకను నిర్వహించారు. మహిళలు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తల్లిని దర్శించుకున్నారు. ముగ్రాటల తో ఆలయ ప్రాంగణం చేరుకుని అమ్మవారికి మ్రొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలు ,మేళ తాళాలతో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిది మజ్జి వెంకట రమణ , మాజీ సర్పంచ్ ఎం రమణయ్య , వార్డు నెంబర్ పి.గోవింద్ , హేమంతు తదితరులు పాల్గొన్నారు.

# వంట గది అందాన్ని పెంచే కిచెన్ గాడ్జెట్స్




ఇంటిలోని అన్ని ప్రదేశాలలో వంట గది చ్చాలా ముఖ్యమైంది. కుటుంబ సభ్యులందరి ఆరోగ్యానికి చాలా కీలకంగా ఉంటుంది. వంట గది ఆధునికంగా, శుభ్రంగా ఉన్నప్పుడే ఇంట్లో వారందరికీ మనశ్శాంతి లభిస్తుంది. ఆధునిక కాలంలో అనేక కొత్త వంట గది ఉపకరణాలు (కిచెన్ గాడ్జెట్స్) అందుబాటులోకి వచ్చాయి. ఇవి వంట పనిని సులభం చేయడంతో పాటు సమయాన్ని కూడా ఆదా చేస్తాయి. వీటిని ఉపయోగించుకుని రుచికరమైన ఆహారాన్ని చాలా తొందరగా తయారు చేసుకోవచ్చు. అలాగే వంట గదిలో మీ శ్రమను కూడా బాగా తగ్గిస్తాయి. ఈ నేపథ్యంలో అమెజాన్ లో తక్కువ ధరకు అందుబాటులో ఉన్న వంట గది ఉపకరణాలు, వాటి ఉపయోగాలు, ధరల వివరాలను తెలుసుకుందాం. వంటగదిలోని అతి ముఖ్యమైన వస్తువు గ్యాస్ స్టవ్. ఇది సౌకర్యవంతంగా ఉంటేనే వంట పనిని చాలా సుఖంగా, వేగంగా చేయగలం. బియాండ్ అప్లయన్సెస్ నుంచి విడుదలైన గ్యాస్ స్టవ్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఎల్పీజీ శక్తితో పనిచేసే ఈ స్టవ్ లో డిజిటల్ టైమర్ ఉంది. దీంతో ఆహారం అతిగా ఉడక్కుండా నిరోధిస్తుంది. ఆటో ఇగ్నిషన్ బర్నర్ల కారణంగా లైటర్ అవసరం ఉండదు. స్టైలిష్ డిజైన్, భద్రత, పటిష్టమైన గాజుతో దీన్ని రూపొందించారు. గ్యాస్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు మన భారతీయ వంటలకు చక్కగా సరిపోతుంది. భోజనం చేసిన తర్వాత ప్లేట్లను శుభ్రం చేసే యంత్రాన్నే డిష్ వాషర్ అంటారు. ఈ రోజుల్లో ప్రతి ఇంటిలోనూ దీని అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బాష్ కంపెనీ నుంచి విడుదలైన 13 ప్లేస్ సెట్టింగ్ ల, ఫ్రీ స్టాండ్ డిష్ వాషర్ చాలా బాగుంటుంది. మీరు తిన్న తర్వాత ఆ పాత్రలను దీనిలో వేస్తే చాలు. తక్కువ విద్యుత్ , నీటిని ఉపయోగించుకుని సామగ్రిని తళతళలాడేలా చేస్తుంది. సాధారణంగా మీరు పాత్రలను కడగాలంటే సుమారు 60 లీటర్ల నీరు అవసరమవుతుంది. కానీ బాష్ డిష్ వాషర్ కేవలం పది లీటర్ల నీటితో శుభ్రం చేసేస్తుంది. అమెజాన్ లో రూ.47,500కు బాష్ డిష్ వాషర్ అందుబాటులో ఉంది. వంట చేసినప్పుడు వెలువడే పొగ, నూనె వాసనలు బయటకు పంపడానికి కిచెన్ చిమ్నీ చాలా అవసరం. ఫేబర్ నుంచి విడుదలైన 60 సెం.మీ ఆటో క్లీన్ చిమ్నీ ఈ పనిని చాలా సమర్థవంతంగా చేస్తుంది. పొగలు, గ్రీజు, డీప్ ఫ్రై చేసినప్పుడు వెలువడే పొగలను లాక్కుని, వంట గదిని ఎప్పటికప్పుడు తాజాగా ఉంచుతుంది. టచ్ ఫ్రీ ఆపరేటింగ్, ఐక్లీన్ రిమైండర్, బలమైన బాఫిల్ ఫిల్టర్, తక్కువ శబ్దం, ఆటో క్లీన్, మూడ్ లైట్ దీని ప్రత్యేకతలు. గోడకు అమర్చుకునే ఈ చిమ్నీని అమెజాన్ లో రూ.14,290కి కొనుగోలు చేయవచ్చు. ఆధునిక కాలంలో మైక్రోవేవ్ లు అనేక ఫీచర్లతో అందుబాటులోకి వచ్చాయి. అలాంటి వాటిలో ఎల్జీ 28 ఎల్ కన్వెక్షన్ మైక్రోవేవ్ ఓవెన్ ఒకటి. దీంతో బేకింగ్, గ్రిల్లింగ్, స్టీమింగ్, డీఫ్రాస్టింగ్ తో పాటు కేవలం 12 నిమిషాల్లోనే జేసెమ్ ను తయారు చేసుకోవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే వంట గదిలో ఆల్ రౌండర్ అన్నమాట. 251 ఆటో కుక్ ఎంపికలు, స్టెయిన్ లెస్ స్టీల్ చాంబర్, చైల్డ్ లాక్ తదితర ఫీచర్లు బాగున్నాయి. బేకరీ తరహా ఆహార పదార్థాలను ఇంటిలోనే చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు. అమెజాన్ లో రూ.12,989కి మైక్రో ఓవెన్ అందుబాటులో ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే తక్కువ నూనెతో వంటకాలు తయారు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కానీ అలా తయారు చేయడం వల్ల ఆహారానికి రుచి రాదు. ఇలాంటి సమయంలో ఫిలిప్స్ ఎయిర్ ఫ్రైయర్ చాలా ఉపయోగంగా ఉంటుంది. కేవలం పది శాతం నూనెతో క్రిస్పీ ఫ్రైస్, జ్యూసీ కబాబ్ లను తయారు చేసుకోవచ్చు. దీనిలోని రాపిడ్ ఎయిర్ టెక్నాలజీతో ఇష్టమైన ఆహారాన్ని వండుకోవచ్చు. గ్రిల్ చేయడం, రోస్ట్ చేయడం, మళ్లీ వేడి చేయడం, కరిగించడం, డీహైడ్రేడ్ చేయడం.. ఇలా అన్ని పనులు చిటికెలో పూర్తవుతాయి. సాధారణ ఓపెన్ కంటే దాదాపు 70 శాతం తక్కువ విద్యుత్ ను ఉపయోగిస్తుంది. అమెజాన్ లో రూ.4,799కి ఫిలిప్స్ ఎయిర్ ఫ్రైయర్ అందుబాటులో ఉంది.

# ఆవులు ప్లాస్టిక్ తింటే ఏమవుతుందో తెలుసా?



నిత్య జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగమైపోయింది. దీని వాడకాన్ని మనం తగ్గించలేకపోతున్నాం. ఆహార వినియోగం, నిల్వ నుంచి ప్రతి దశలో ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తున్నాం. అంతేకాదు మనం ప్లాస్టిక్ వాడిన తర్వాత ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నాం కూడా. ప్లాస్టిక్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందనేది కాదనలేని సత్యం. అయినప్పటికీ మనం నిత్య జీవితంలో దాని వాడకాన్ని తగ్గించలేకపోతున్నాం. మనం ఆహార వినియోగం, నిల్వ నుంచి ప్రతి దశలో ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తున్నాం. అంతేకాదు మనం ప్లాస్టిక్ వాడిన తర్వాత ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నాం కూడా. అయితే మన చుట్టూ ఉన్న జంతువులు తెలియకుండానే ఈ కవర్లను తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇందులో ఆవుల సంఖ్య అత్యధికం. ఇది ఇప్పటి సమస్య కాదు.. ఈ సమస్య చాలా సంవత్సరాలుగా ఆవుల పాలిట శాపంగా మారింది. ఆవులు ప్లాస్టిక్ తినడం మంచిది కాదని అందరికీ తెలుసు. కానీ వాటిని ఎలా నిరోధించాలో? ఆవులకు ఎలాంటి ప్రమాదాన్ని కలిగిస్తుందో? చాలా మందికి అవగాహన లేకపోవడం దురదృష్టకరం. నేటికీ ప్లాస్టిక్ అనేక పశువుల మరణాలకు కారణమవుతోంది. మేత మేసే సమయంలో ఆవులు రోడ్లపై పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తినే ధోరణి పెరుగుతోంది. ప్లాస్టిక్ తినడం వల్ల చనిపోయిన జంతువుల కళేబరాలను కాకులు, గద్దలు కూడా ముట్టుకోవు. అంతేకాకుండా ఆవులను ప్లాస్టిక్ తినవద్దని మనం చెప్పలేం. వాటికి మానవ భాష అర్థంకాదు. అయితే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా మనం ఈ సమస్యను నివారించవచ్చు. మనం వీలైనంత వరకు ప్లాస్టిక్‌లోని ఆహారాన్ని తినాలి. జంతువులకు ఆహారంగా వాటిని పారవేయడం మానేయాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చు. కడుపులో ప్లాస్టిక్‌లు జీర్ణం కావు. దీనివల్ల పశువులు చనిపోతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం వల్ల చనిపోయే జంతువులలో, ఆవుల సంఖ్య మరింత ఎక్కువ. ఆవుల దవడల నిర్మాణం వాటికి ఏమి తింటున్నాయో తెలియదని విధంగా ఉంటుంది. అవి ఆహారాన్ని నమిలినప్పటికీ, వాటి పెదవులు వ్యర్థాలను గుర్తించేంత సున్నితంగా ఉండవు. దీని కారణంగా ఆవులు ప్లాస్టిక్‌ను తింటున్న విషయాన్ని అవి గ్రహించలేవు. పైగా వాటికి వాంతులు చేసుకోవడం రాదు. దీంతో ఆవుల కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఇతర ఆహారాన్ని తినడానికి వీలు లేకుండా ఉంటుంది. ప్లాస్టిక్ మాత్రమే కాదు చనిపోయిన ఆవుల కడుపులో పదునైన ఇనుప ముక్కలు, మేకులు కూడా కనిపిస్తాయి. ఇటువంటి లోహ వ్యర్థాలు ఆవుల కడుపు, ప్రేగులలోకి ప్రవేశించి వాటి ప్రాణాలను హరిస్తున్నాయి.

# మోము చంద్రబింబంలా కనిపించాలంటే..



వేసవిలో చర్మం ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దుమ్ము, సూర్యకాంతి , కాలుష్యం కారణంగా, చర్మం క్షీణించడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా ముఖం నిస్తేజంగా కనిపించడం ప్రారంభమవుతుంది. వేసవిలో, మీరు ముల్తానీ మట్టితో కొన్ని వస్తువులను కలిపి ఫేస్ ప్యాక్ తయారు చేసుకుని అప్లై చేస్తే చర్మం మెరుస్తూ ఉంటుంది. వేసవిలో చర్మం ఆరోగ్యంగా ఉండేందుకు చాలా ఉత్పత్తులను ఉపయోగిస్తారు. అయితే మార్కెట్లో లభించే చాలా ఉత్పత్తులలో రసాయనాలు ఉంటాయి. అవి తక్షణ మెరుపును ఇవ్వవచ్చు.. కానీ దీర్ఘకాలిక నష్టాన్ని కూడా కలిగిస్తాయి. ఎక్కువ రసాయన ఉత్పత్తులను వాడటం వల్ల చర్మం మెరుపు తగ్గుతుంది. ఇతర చర్మ సమస్యలు పెరుగుతాయి. కనుక సహజ ఉత్పత్తులను ఎక్కువగా ఉపయోగించేందుకు ప్రయత్నించాలి. ముల్తానీ మట్టి మన అమ్మమ్మల కాలం నుంచి వాడుకలో ఉంది. నేటికీ ప్రజలు ముల్తానీ మట్టిని వాడుతున్నారు. ఇది చర్మంలోని నూనెను నియంత్రించి ముఖంపై మెరుపు ఉండేలా చేస్తుంది. ముల్తానీ మిట్టిలో ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాలు ఉన్నాయి. ఇవి ముఖం మీద పిగ్మెంటేషన్, మచ్చలు, మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి, అయితే ముల్తానీ మిట్టిలో కొన్నిటిని కలిపి అప్లై చేస్తే రెట్టింపు ప్రయోజనాలను పొందుతారు. కనుక ఈ రోజు ముల్తానీ మట్టితో వేటిని కలిపి ఫేస్ ప్యాక్ తయారు చేయాలి? ఎలా చేయాలి? ముల్తానీ మట్టి క్లెన్సర్ .. ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తుంది. దీన్ని రోజూ వాడటం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. ఇది చర్మ రంధ్రాలను శుభ్రపరుస్తుంది. అదనపు నూనెను తగ్గిస్తుంది. చర్మం మీద మృతకణాలను తగ్గిస్తుంది. మొటిమలను కూడా తగ్గిస్తుంది. చర్మం మెరుపు చెక్కుచెదరకుండా ఉంటుంది. ముల్తానీ మట్టి, బంగాళాదుంప రసం చర్మానికి మేలు చేస్తాయి. ఈ ఫేస్ ప్యాక్ తయారు చేయడానికి బంగాళాదుంపను తురిమి రసం తీసి.. ఆ రసం లో ముల్తానీ మిట్టిని కలపండి. ఈ పేస్ట్‌ను ముఖంపై అప్లై చేసి, 15-20 నిమిషాలు ఉండి ఆపై చల్లటి నీటితో ముఖం కడుక్కోండి. ఇలా చేయడం వలన చర్మం ప్రకాశవంతంగా, మృదువుగా మారుతుంది. ముల్తానీ మట్టితో టమోటా రసం కలిపి అప్లై చేయడం వల్ల చర్మానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. టమాటో రసం చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడంలో, మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది, ముల్తానీ మిట్టి చర్మం నుంచి అదనపు నూనె, మురికిని తొలగించడంలో సహాయపడుతుంది. ఈ మిశ్రమం టానింగ్‌ను కూడా తొలగిస్తుంది. ముఖంపై మెరుపు చెక్కుచెదరకుండా ఉంటుంది. ముల్తానీ మట్టి .. నిమ్మరసం చర్మానికి చాలా మేలు చేస్తాయి. ఈ ఫేస్ ప్యాక్ ని అప్లై చేయడం వల్ల టానింగ్, మొటిమలు తొలగిపోతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి. చర్మం మెరుపును కాపాడుకునేందుకు ఈ వంటింటి చిట్కాలను పాటించాలి. ఇవి వేసవి కాలంలో టానింగ్, పొడిబారడం, మచ్చలు, మొటిమలు వంటి అన్ని చర్మ సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం ఇస్తాయి. ముఖం మచ్చ లేకుండా చంద్ర బింబంలా కనిపిస్తుంది.

# పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి..?



వీటిలో అధిక మొత్తంలో యాంటీబాడీలు ఉంటాయని చెబుతున్నారు. ఇది హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి శిశువును కాపాడుతుంది. ఇవి శిశువు పెరుగుదల, అభివృద్ధికి చాలా అవసరం అంటున్నారు. పసి పిల్లలకు తొలుత పట్టించే ముర్రుపాలు తక్కువ కొవ్వు కలిగి ఉంటుంది.. శిశువుకు సులభంగా జీర్ణమవుతాయి. ముర్రుపాలు శిశువు, తల్లి మధ్య బలమైన బంధాన్ని ఏర్పరచడానికి సహాయపడతాయి. అందుకే ప్రతి తల్లి పుట్టిన వెంటనే తన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం చాలా ముఖ్యం అంటున్నారు వైద్యులు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు దగ్గరినుంచి వీలైనంత వరకు అమ్మపాలు తప్పనిసరిగా తాగించాలని పెద్దలు, వైద్యులు తరచూ చెబుతూనే ఉంటారు. పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించటం వల్ల మేధోశక్తి పెరుగుతుందని అనేక అధ్యయనాలు తేల్చాయి. మొదటి పాలు నవజాత శిశువుకు ఒక అమూల్యమైన వరంగా చెబుతున్నారు.. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల ఊహించని లాభాలు లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.అమ్మపాలు తాగేవారిలో మేధోశక్తి కూడా అధికంగా ఉంటుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. చిన్నప్పుడు వీలైనంత ఎక్కువకాలం అమ్మపాలు తాగిన వారిలో తెలివితేటలు కూడా ఎక్కువని తేలింది. సాధారణ పాల కంటే ముర్రుపాలలో భిన్నమైన పోషక విలువలను కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో అధిక మొత్తంలో యాంటీబాడీలు ఉంటాయని చెబుతున్నారు. ఇది హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి శిశువును కాపాడుతుంది. ఇవి శిశువు పెరుగుదల, అభివృద్ధికి చాలా అవసరం అంటున్నారు. పసి పిల్లలకు తొలుత పట్టించే ముర్రుపాలు తక్కువ కొవ్వు కలిగి ఉంటుంది.. శిశువుకు సులభంగా జీర్ణమవుతాయి. ముర్రుపాలు శిశువు, తల్లి మధ్య బలమైన బంధాన్ని ఏర్పరచడానికి సహాయపడతాయి. అందుకే ప్రతి తల్లి పుట్టిన వెంటనే తన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం చాలా ముఖ్యం అంటున్నారు వైద్యులు.

## బిజినెస్

# ఏంజెల్ ట్యాక్స్ రద్దు.. ఇన్ని ప్రయోజనాలు

## టిమ్ కుక్ సూపర్..
## బెర్క్‌షైర్‌కు యాపిల్ నాకంటే ఎక్కువ ఇచ్చింది



**ఇంటర్నెట్‌డెస్క్:** ప్రపంచంలోనే దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ యాపిల్ సీఈవో టిమ్ కుక్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. బెర్క్‌షైర్ హాత్‌వేకు తన కంటె ఎక్కువగా యాపిలే ఇచ్చిందని పేర్కొన్నారు. టిమ్ కుక్ నేతృత్వంలో అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధించిందని పేర్కొన్నారు. బెర్క్‌షైర్ వార్షిక మీటింగ్ ప్రారంభం సందర్భంగా బఫెట్ ఈ వ్యాఖ్యలు చేశారు. "బెర్క్‌షైర్ సంస్థకు టిమ్‌కుక్ నాకంటే ఎక్కువ చేశారు. ఆయన చేసిన దానికి క్రెడిట్ కచ్చితంగా ఇవ్వాల్సిందే. స్టీవ్ జాబ్స్‌తో నాకు కొంత పరిచయం ఉంది. అతడు చేసినట్లు మరెవరికి సాధ్యంకాదు. యాపిల్‌ను సృష్టించడం స్టీవ్‌కే సాధ్యమైంది. కానీ, ఆ సంస్థను టిమ్ వలే వృద్ధి చేయడం ఎవరికీ సాధ్యంకాదు" అని వ్యాఖ్యానించారు. టిమ్‌కుక్ 2011లో యాపిల్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి కంపెనీ షేర్ విలువ గణనీయంగా పెరిగింది. 2016-19 మధ్య బెర్క్‌షైర్ సంస్థ యాపిల్లో దాదాపు 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టింది. అవి 2023 నాటికి అవి 173 బిలియన్ డాలర్లకు చేరుకొన్నాయి. విజయవంతమైన పెట్టుబడి అయినా.. 2024లో దాదాపు 67శాతం వాటాలను బెర్క్‌షైర్ విక్రయించేసింది. కేవలం 30 కోట్ల వాటాలను మాత్రమే ఉంచుకొంది. వాటివిలువ 62 బిలియన్ డాలర్లు. ప్రస్తుతం యాపిల్ షేర్ 205 డాలర్ల వద్ద ఉంది. వారెన్ బఫెట్ బెర్క్‌షైర్ హాత్‌వే సీఈవో పదవిని త్వరలో వీడనున్నారు. ఈ మేరకు ఆయన తన రిటైర్మెంట్ ప్రణాళికలను ప్రకటించారు. 2025 చివరి నాటికి ఆ పదవి నుంచి వైదొలుగుతానని శనివారం జరిగిన వార్షిక వాటాదారుల సమావేశంలో వెల్లడించారు.

## మరిన్ని కంపెనీలు కొంటాం: ప్రముఖ సీఈవో



**న్యూఢిల్లీ:** వేల్యుయేషన్ సముచితంగా ఉంటే మరిన్ని కంపెనీలను కొనుగోలు చేస్తామని 'యూనికామర్స్ ఈసొల్యూషన్స్' సీఈవో కపిల్ మఖీజా తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ%-%కామర్స్ విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకున్నాయని, ఆమ్నిచానల్‌లాంటి కొత్త మోడల్స్ తెరపైకి వచ్చాయని ఆయన చెప్పారు. కంపెనీ ఇటీవలే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫాం షిప్‌వేను కొనుగోలు చేసిన నేపథ్యంలో కపిల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూనికామర్స్ ప్రస్తుతం 7,000 పైచిలుకు వ్యాపారా లకు సేవలు అందిస్తోందని ఆయన వివరించారు. ఈ-కామర్స్ వ్యవస్థలో కస్టమర్లతో సంప్రదింపుల దశ, లావాదేవీలను ప్రాసెస్ చేసే దశ, ఆర్డరును పూర్తి చేసే దశ అని మూడు దశలు ఉంటాయని, తమ సంస్థ ఈ మూడు అంశాల్లోనూ సర్వీసులు అందిస్తోందని కపిల్ వివరించారు. తాము ఇప్పటికే భారత్ కాకుండా ఆరు దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని, మరింతగా విస్తరించే యోచనలో ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



దేశీయంగా అంకుర (స్టార్టప్) వ్యవస్థ ఎంతగా వేళ్లూనుకుందో చెప్పడానికి ఈ గణాంకాలే నిదర్శనం. వినూత్న ఆలోచనను సేవ/ఉత్పత్తిగా ఆవిష్కరించే ప్రక్రియలో నిమగ్నమయ్యే అంకురాలను 'నిధుల సమీకరణ ప్రక్రియలో ఇబ్బంది పెట్టిన' ఏంజెల్ ట్యాక్స్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి ప్రభుత్వం తొలగించింది. ఫలితంగా పెట్టుబడిదార్లకు ఊరట కలగడంతో పాటు, సంస్థ నిర్వహణ-తమ లక్ష్యాలపై మాత్రమే దృష్టి సారించేందుకు ఔత్సాహిక వాణిజ్య వేత్తలకు వీలవుతోంది.

### 2012లో అమల్లోకి

నమోదుకాని కంపెనీలు పెట్టుబడిదార్ల నుంచి సమీకరించే నిధులను, లాభంగా పరిగణించి.. సెక్షన్ 56(2)లో 7బి నిబంధన ప్రకారం ఆదాయపు పన్ను విభాగం వసూలు చేసేదే ఏంజెల్ ట్యాక్స్. అప్పట్లో అంకురాలకు బ్యాంకులు రుణాలిచ్చేవి కావు. ప్రైవేటు సంస్థలు, వ్యక్తులే పెట్టుబడులు పెట్టేవారు. అంకురం విలువ నిర్ధారించేందుకు తగిన మార్గదర్శకాలు లేనందున, నిధుల అక్రమ బదిలీకి - మనీ లాండరింగ్‌కు అంకుర వ్యవస్థను పలువురు వినియోగించుకున్నారు. ఇలాంటి అక్రమాల నిరోధానికి 2012లో ప్రవేశపెట్టిందే ఏంజెల్ ట్యాక్స్. ఇప్పుడు అంకుర వ్యవస్థ.. విలువ గణన ప్రక్రియలు బలోపేతం కావడం, నగదు బదిలీ-పన్ను వ్యవస్థలకు సంబంధించిన డేటా అంతా అనుసంధానమవ్వడం వల్ల, వీటిల్లో పెట్టుబడులపై నిఘా అవసరం లేదు. 2016, 2019లో విభాగాలు, రంగాల వారీగా, దేశీయ పెట్టుబడిదార్లకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. 2023లో విదేశీ పెట్టుబడిదార్లకూ ప్రయోజనాలు విస్తరించారు. ఇప్పుడు పూర్తిగా తొలగించారు.

### సంస్థ విలువను లెక్కించేందుకు

'ఒక సంస్థ విలువను లెక్కించేందుకు ప్రాఫిటబులిటీ/రెవెన్యూ మల్టిపుల్స్, డిస్కౌంటెడ్ క్యాష్‌ఫ్లోస్‌ను ప్రాతిపదికగా తీసుకుంటారు. అంకుర సంస్థల్లో ఆలోచన/ప్రోటోటైప్ ఉంటుంది కానీ, ఉత్పత్తి/సేవ ఉండదు. అవి సిద్ధం కానప్పుడే, సంస్థకు విలువ ఎలా లెక్కిస్తారు' అనేది ప్రభుత్వ వాదన. 'మా ఆలోచన కార్యరూపం దాలిస్తే, అయిదేళ్లలో ఇంత ఆదాయం/లాభాలు ఆర్జించగలం అని అంకుర సంస్థలు చెబుతాయి. వీరి బిజినెస్ మోడల్/పరిష్కరించే సమస్య తీరును బట్టి.. ఆయా సంస్థలు ఎంత వ్యాపారం చేయగలవో అంచనా వేసి, ఏంజెల్ ఇన్వెస్టర్లు పెట్టుబడి పెడతారు. 'ప్రస్తుతం ఇంతమంది వినియోగదార్లున్నారు.. తొలి ఏడాది పూర్తయ్యేసరికి ఇంతమంది ఖాతాదార్లు వస్తారు, వారిపై ఇంత ఆదాయం/లాభం వస్తుంది. డిస్కౌంటెడ్ క్యాష్‌ఫ్లో ప్రకారం.. మా సంస్థ విలువ ఇంత' అని వివరిస్తే.. అంగీకరించిన వారే పెట్టుబడి పెడతారు.

### ప్రభుత్వం ఏమనేది?

ప్రభుత్వం మాత్రం సదరు అంకురం తరహాలోని కంపెనీలను, వాటి ఆదాయాలు, లాభదాయకతను బేరీజు వేసుకుని, సంస్థకు ఒక విలువను వెల్లడిస్తుంది. అంతకుమించి విలువ చూపి, దానికనుగుణంగా సమీకరించిన నిధులపై పన్ను వేసేది. ఉదాహరణకు సదరు అంకురం విలువ రూ.5 కోట్లని ప్రభుత్వం పేర్కొంది అనుకుందాం. ఆ సంస్థ నిర్వాహకులు రూ.10 కోట్లు సమీకరించి ఉంటే, రూ.5 కోట్లు లాభంగా పరిగణించి, దీనిపై 30.9% పన్ను కట్టమని ఆదాయపు పన్ను విభాగం కోరేది. అంటే అంకుర సంస్థ రూ. కోటిన్నరపైనే పన్ను కట్టేది. అంటే వారికి మిగిలింది రూ.8.5 కోట్లు. ఆశించిన మొత్తం కంటే తక్కువ నిధులు మిగలడంతో.. సంస్థ సామర్థ్యం, భవిష్యత్తు లాభాదాయాలు అంచనాల కంటే తగ్గేవి. ఈ బాధలు పడలేక, బయటినుంచి డబ్బులు సమీకరించకుండా ఔత్సాహికులు సొంత నిధులు, సన్నిహితుల నుంచే సమీకరించేవారు.

# ఐపీవోకు సిద్ధమవుతున్న ప్రముఖ కంపెనీలు



ఆభరణాల రిటైల్ కంపెనీ ప్రయారిటీ జ్యువెల్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 54 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఈ నిధుల్లో రూ. 75 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2007లో ఏర్పాటైన కంపెనీ బంగారం, ప్లాటినం, వెండిసహా వజ్రాలతోకూడిన ఆభరణాలను తయారు చేసి విక్రయిస్తోంది. క్యారట్‌లేన్, కళ్యాణ్ జ్యువెలర్స్, మలబార్ గోల్డ్, రిలయన్స్ రిటైల్, టీబీజెడ్, సెన్‌కో గోల్డ్ తదితర జ్యువెలరీ రిటైల్ స్టోర్లకు సైతం ప్రొడక్టులు సరఫరా చేస్తోంది. పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతున్న స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతో చర్చలు నిర్వహిస్తోంది. కొన్ని కీలక అంశాల పరిష్కారం కోసం ఎన్‌ఎస్‌ఈ, సెబీ మధ్య చర్చలు కొనసాగుతున్నుట్లు సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే తాజాగా వెల్లడించారు. కీలక యాజమాన్య వ్యక్తులకు చెల్లింపులు, టెక్నాలజీ, క్లియరింగ్ కార్పొరేషన్‌లో మెజారిటీ ఓనర్‌షిప్ తదితర అంశాలపై సెబీ ఎన్‌ఎస్‌ఈతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఈ ఐపీవో చేపట్టేందుకు వీలుగా ఎన్‌వోసీ కోసం సెబీకి దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే. ఫార్మా రంగ కంపెనీ కొరోనా రెమిడీస్ ఐపీవో బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం కంపెనీ రూ. 800 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 800 కోట్లు సమీకరించనున్నప్పటికీ నిధులు కంపెనీకి లభించబోవు. మహిళా ఆరోగ్య పరిరక్షణ, కార్డియో%-% డయాబెటో, పెయిన్ మేనేజ్‌మెంట్, యూరాలజీ తదితర విభాగాలలో కంపెనీ ప్రొడక్టులు రూపొందిస్తోంది.

## స్పోర్ట్స్

## టీమిండియాకు చేదు అనుభవం..
# లంక చేతిలో ఓటమి



ముక్కోణపు వన్డే సిరీస్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న భారత మహిళా జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. శ్రీలంకతో ఆదివారం నాటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన మూడు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. కాగా శ్రీలంక- భారత్- దక్షిణాఫ్రికా మధ్య లంక వేదికగా త్రైపాక్షిక సిరీస్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూడు జట్ల మధ్య ఆరు మ్యాచ్‌ల తర్వాత ఫైనల్ జరుగుతుంది. ఈ క్రమంలో తొలి మ్యాచ్‌లో శ్రీలంకను తొమ్మిది వికెట్ల తేడాతో చిత్తు చేసిన టీమిండియా.. రెండో వన్డేలో దక్షిణాఫ్రికాపై 15 పరుగుల తేడాతో గెలిచింది. తాజాగా ఆదివారం శ్రీలంకతో మ్యాచ్‌లోనూ గెలుపొంది హ్యాట్రిక్ కొట్టాలని భావించింది. అయితే, అనూహ్య రీతిలో ఓటమిపాలైంది. కొలంబో వేదికగా టాస్ గెలిచిన ఆతిథ్య శ్రీలంక తొలుత బౌలింగ్ చేసింది.

ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 275 పరుగులు చేసింది. ఓపెనర్లలో ప్రతికా రావల్ (35) ఫర్వాలేదనిపించగా.. స్మృతి మంధాన (18) మాత్రం విఫలమైంది. మిగతా వాళ్లలో హర్లీన్ డియోల్ 29, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 30, జెమీమా రోడ్రిగెస్ 37 పరుగులు చేయగా.. వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ అర్ధ శతకం (48 బంతుల్లో 58)తో రాణించింది. ఆల్‌రౌండర్లు దీప్తి శర్మ 24, కశ్వీ గౌతమ్? 17.. టెయిలెండర్లు స్నేహ్ రాణా 10, అరుంధతి రెడ్డి 9 (నాటౌట్) పరుగులు రాబట్టారు. శ్రీలంక బౌలర్లలో సుగందిక కుమారి, కెప్టెన్ చమరి ఆటపట్టు మూడేసి వికెట్లతో చెలరేగగా.. డెమీ విహంగ, ఇనక రణవీర ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

### హర్షిత, నీలాక్షి హాఫ్ సెంచరీలు

ఇక లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు హాసిని పెరీరా (22), విష్మి గుణరత్నె (33) శుభారంభం అందించగా.. వన్‌డౌన్ బ్యాటర్ హర్షిత సమరవిక్రమ హాఫ్ సెంచరీ (53)తో అదరగొట్టింది. అయితే, కెప్టెన్ చమరి ఆటపట్టు మాత్రం స్థాయికి తగ్గట్లు ఆడలేక 23 పరుగులకే వెనుదిరగగా.. కవిష దిల్హారి (35)తో కలిసి నీలాక్షి డి సిల్వా (56) ఇన్నింగ్స్ చక్కదిద్దింది. వికెట్ కీపర్ బ్యాటర్ అనుష్క సంజీవని (23), సుగందిక కుమారి (19) కుమారి కలిసి అజేయంగా నిలిచి.. జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ క్రమంలో మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే ఏడు వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసిన శ్రీలంక.. మూడు వికెట్ల తేడాతో హర్మన్ సేనను ఓడించింది. తదుపరి బుధవారం భారత జట్టు సౌతాఫ్రికాతో వన్డే ఆడనుంది.

## పరాగ్ పవర్ హిట్టింగ్..
## ఒకే ఓవర్లో 5 సిక్సర్లు!



ఓవైపు వికెట్లు పడుతున్నా రియాన్ పరాగ్(86) మాత్రం తన పవర్ హిట్టింగ్‌తో ఈడెన్ గార్డెన్స్‌ను హోరెత్తిస్తున్నాడు. సిక్సర్లతో రెచ్చిపోతున్నాడు. మోయిన్ అలీ బౌలింగ్‌లో సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన పరాగ్.. ఆ తర్వాత నాలుగు బంతుల్ని అలవోకగా స్టాండ్స్‌లోకి పంపాడు. వీటిల్ స్వీప్ షాట్‌తో కొట్టిన సిక్సర్ మాత్రం ఖతర్నాక్ అని చెప్పాలి. పరాగ్ విధ్వంసంతో ఆ ఓవర్లో 32 రన్స్ వచ్చాయి. దాంతో, స్కోర్ 130కి చేరింది. మరో ఎండ్‌లో హెట్‌మైర్(26) సైతం దంచేస్తున్నాడు. నరైన్ ఓవర్లో ఓ సిక్సర్ సంధించాడు. దాంతో, రాజస్థాన్ 15 ఓవర్లకు 155 పరుగులు చేసింది. ఇంకా విజయానికి 52 రన్స్ కావాలి. భారీ ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లు మళ్లీ అదే తడబాటు కొనసాగిస్తున్నారు. ఈడెన్ గార్డెన్స్‌లో 205 పరుగుల కొట్టేందుకు సిద్ధమైన ఆ జట్టును మోయిన్ అలీ, వరుణ్ చక్రవర్తిలు వణికించారు. ధాటిగా ఆడుతున్న యశస్వీ జైస్వాల్(34)ను ఔట్ చేసిన అలీ కోల్‌కతాకు బిగ్ బ్రేకిచ్చాడు. ఆ తర్వాత వరుణ్.. ఒకే ఓవర్లో ధ్రువ్ జురెల్(0), వనిందు హసరంగ(0)లను డకౌట్ చేసి రాజస్థాన్‌ను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. 71కే సగం వికెట్లు కోల్పోయిన జట్టును గెలిపించేందుకు పరాగ్, హెట్‌మైర్‌లు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.

## ఐపీఎల్‌లో విరాట్ అరుదైన ఫీట్..
## క్రిస్ గేల్, రోహిత్ స్పెషల్ క్లబ్‌లో ధోనీ..!




ఐపీఎల్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను రెండు పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓడించింది. ఆర్‌సీబీ ఆడిన 11 మ్యాచుల్లో ఇది ఎనిమిదో విజయం. ఈ విజయంతో బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. టాస్ ఓడిన బెంగళూరు జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. చెన్నై జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 211 పరుగులు మాత్రమే చేయగలిగింది. బెంగళూరు తరఫున జాకబ్ బెథెల్ 33 బంతుల్లో 55 పరుగులు చేశాడు. ఇక విరాట్ కోహ్లీ 33 బంతుల్లో 62 పరుగులు చేశాడు. ఇది ఐపీఎల్‌లో కోహ్లీకి 62వ హాఫ్ సెంచరీ చేశాడు. ఈ సీజన్‌లో 500 పరుగులు కూడా పూర్తి చేశాడు. ఈ లీగ్‌లోని 18 సీజన్ల చరిత్రలో అత్యధికంగా 500 పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. అదే సమయంలో మహేంద్ర సింగ్ ధోని, క్రిస్ గేల్, రోహిత్ స్పెషల్ క్లబ్‌లో చేరాడు.

ఈ సీజన్‌లో కోహ్లీ 500 పరుగులు చేశాడు..

కోహ్లీ తన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్ల సహాయంతో హాఫ్ సెంచరీ చేశాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 11 ఇన్నింగ్స్‌లలో 63.12 సగటు, 143.47 స్ట్రయిక్ రేట్‌తో 505 పరుగులు చేశాడు. ఈ సమయంలో 44 ఫోర్లు, 18 సిక్సర్లు బాదాడు. కోహ్లీ ఒక సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేయడం ఇది ఎనిమిదోసారి.

## ఎట్టకేలకి నితిన్ తమ్ముడు రిలీజ్‌పై క్లారిటీ వచ్చేసింది

నితిన్ ఒకప్పుడు వరుస సినిమాలతో ప్రేక్షకులని ఎంతగా అలరించే వారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన సినిమాలు కూడా మంచి హిట్స్ అయ్యేవి. కాని ఈ మధ్య ఆయన చేసిన ప్రయోగాలు ఫలించడం లేదు. నితిన్ కెరీర్ లో ఫ్లాప్స్ కొత్తేమి కాదు. ఒక దశలో కెరీర్ ముగిసింది అనుకున్న టైమ్ లో ఒక్కసారిగా బౌన్స్ బ్యాక్ అయి మంచి హిట్స్ దక్కించుకున్నాడు. ఇటీవల విడుదలైన 'రాబిన్ హుడ్' చిత్రం మంచి హిట్ దక్కించుకుంటుంది అని అందరు అనుకున్నారు. కాని అది కూడా నిరాశపరిచింది.. ఇప్పుడు ఆయన చేస్తున్న 'తమ్ముడు' సినిమా అంచనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. తమ్ముడు చిత్రాన్ని స్టార్ నిర్మాత దిల్ రాజు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులని తప్పక ఆకట్టుకుంటుందని అంటున్నారు. 'వకీల్ సాబ్'తో మంచి డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తమ్ముడు చిత్రంలో నితిన్, సీనియర్ నటి లయ అక్క పాత్రల్లో కనిపించనున్నారు. కాంతార ఫేమ్ సప్తమి గౌడ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఓ కీలక యాక్షన్ ఎపిసోడ్ కోసం రెండు కోట్ల రూపాయల బడ్జెట్ వేశారన్న వార్తలు కూడా హాట్ టాపిక్ అయ్యాయి. ఈ సినిమా రిలీజ్ డేట్ పై కొంత కాలంగా సస్పెన్స్ ఉంది. ఇప్పుడు, అప్పుడు అంటూ వార్తలు తెగ వైరల్ కాగా, అన్ని అనుమానాలకు తెరదించుతూ మూవీ టీమ్ రిలీజ్ డేట్ ను ప్రకటించింది. మూవీ డైరెక్టర్ వేణు శ్రీరామ్ పుట్టిన రోజు సందర్భంగా ఓ స్పెషల్ వీడియో విడుదల చేస్తూ.. జులై 4న రిలీజ్ డేట్ ను ప్రకటించారు.



## మహేష్ హీరోయిన్‌కి త్వరలో తల్లి కాబోతుందంటూ ప్రచారం

మహేష్ బాబు నటించిన నాని చిత్రంలో కథానాయికగా నటించి తెలుగు ప్రేక్షకులని అలరించిన అందాల ముద్దుగుమ్మ అమీషా పటేల్. చూడ చక్కని అందం, ఆకట్టుకునే అభినయంతో ఈ అమ్మడు బాలీవుడ్‌లోను అనేక సూపర్ హిట్ చిత్రాలలో నటించింది. 49 ఏళ్ల వయస్సు వచ్చిన కూడా ఈ అమ్మడు ఇంకా పెళ్లి చేసుకోలేదు. స్టిల్ బ్యాచిలర్. అయితే ఈ వయస్సులో కూడా తాను పెళ్లి చేసుకోకపోవడం పట్ల ఎలాంటి బాధలేదని అంటుంది. పెళ్లికి ఎప్పుడు తను ప్రాధాన్యత ఇవ్వలేదని, తన పనిని ఎక్కువగా ఇష్టపడతానని అంటుంది. రిలేషన్ షిప్ లోకి ఎంటర్ కావాలంటే దానికి కొంత సమయం కేటాయించాలి. అలానే కొంత ఇంత ఇంట్రెస్ట్ కూడా ఉండాలి. ఇప్పుడు అవి రెండు తనకి లేవని అమీషా పేర్కొంది. తనలాంటి సక్సెస్ ఫుల్ ఉమెన్, ఇండిపెండెంట్ ఉమెన్‌తో ఏ పురుషుడైనా జీవించడం అంత సులభం కాదని కూడా అమీషా చెప్పారు. తన జీవితం ఇప్పటికే పూర్తి అయిందని, తన గురించి తనకు నమ్మకం ఉందని, కాబట్టి ఇప్పుడు తనకు జీవిత భాగస్వామి అవసరం లేదని అమీషా అంటుంది. బయట నుండి వచ్చి బాలీవుడ్‌లో మంచి స్థానం సంపాదించుకున్నందుకు గర్వంగా ఉందని అంటుంది. తాజాగా అమీషా పటేల్‌కి సంబంధించిన ఓ వార్త ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తుంది.తాను త్వరలో తల్లి కాబోతుంది అంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం నడుస్తుంది. అందుకు కారణం ఇటీవల దుబాయ్‌లో విహారయాత్రకు వెళ్లినప్పుడు దిగిన కొన్ని ఫొటోలు ,వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందులో ఆమె పొట్ట కాస్త ఉబ్బినట్టుగా కనిపించడంతో అమీషా గర్భవతి అని అంటున్నారు. ముఖ్యంగా, ఆమె ఒక వీడియోలో ఆకుపచ్చ రంగు బికినీ వేసుకొని ఉండగా, అందులో ఆమె బేబీ బంప్ లుక్‌తో కనిపించింది. దీంతో ఆమె ప్రగ్నెంట్ అనే వార్తలు మరింత ఊపందుకున్నాయి. అంతేకాకుండా, ఆమె ఒక సందర్భంలో డ్రింక్ కోసం గ్లాసు పైకెత్తినప్పుడు వైన్ కాకుండా నీరు త్రాగడంతో అనుమానాలు బలపడ్డాయి. దీంతో నెటిజన్స్ కొన్ని క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. పెళ్లి కాకుండానే తల్లి అయిందంటూ తెగ ప్రచారాలు చేస్తున్నారు. అయితే అమీషా పటేల్ వ్యక్తిగత జీవితం ఎప్పుడూ హాట్ టాపిక్ అవుతూనే ఉంటుంది. గతంలో ఆమె నిర్వాన్ బిర్లాతో డేటింగ్ చేస్తోందనే వార్తలు వచ్చిన దానిపై స్పందించింది లేదు. ఇక తెలుగులో అమీషా పటేల్ బద్రి, నాని లాంటి చిత్రాల్లో నటించింది.








## అమెరికాలో రానా సందడి.. హాలీవుడ్ దిగ్గజాలతో భేటీ!

టాలీవుడ్ హీరో రానా నాయుడు యూఎస్‌లో సందడి చేశారు. ఇటీవల డబ్ల్యూడబ్ల్యూఈ రేజ్లింగ్ మేనియాలోనూ కనిపించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న రానా మియామి గ్రాండ్ ప్రిక్స్ వీకెండ్ ఈవెంట్‌కు హాజరయ్యారు. అక్కడే హాలీవుడ్‌లో ప్రముఖ సంగీత దిగ్గజాలైన 50 సెంట్, ఆ?స్కార్ విజేత అయిన గూడింగ్ జూనియర్‌తో ముచ్చటించారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండియాకు చెందిన లోకా లోకా పార్టీ సంస్థ ఏర్పాటు చేసిన ఈవెంట్‌కు రానా హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే లోకా లోకా సంస్థకు సహా వ్యవస్థాపకుల్లో ఒకరైన రానా దగ్గుబాటి ఈవెంట్‌లో సందడి చేశారు. ఈ కంపెనీకి హర్ష వడ్లమూడి, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కలిసి ముగ్గురు ఈ సంస్థకు కో ఓనర్స్‌గా ఉన్నారు. అమెరికా మార్కెట్లో తమ సంస్థ విస్తరణ కోసమే రానా అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. రానా చొరవతో అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ లైఫ్ స్టైల్ బ్రాండ్‌గా లోకా లోకా సంస్థ మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా వ్యాపారం, వినోదం, క్రీడల ప్రపంచానికి నిలయమైన మియామిలో రానా దగ్గుబాటి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు.

## 'హరి హర వీరమల్లు' ఫైనల్ షెడ్యూల్ కోసం పవన్ రెడీ



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరి హర వీరమల్లు' చిత్రం చారిత్రక నేపథ్యంలో రూపొందుతోంది. 'రూల్స్ రంజన్' ఫేమ్ జ్యోతి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా మొదటి భాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, వీడియో గ్లింప్స్, పాటలతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం చిత్రీకరణ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. అయితే, పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల మిగిలిన చిత్రీకరణ వాయిదా పడుతూ వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ ఈ చిత్ర షూటింగ్ ప్రారంభం కానుంది. తాజా సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ మే 4 నుండి షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు తెలుస్తుంది. మే 7-8 తేదీలలో షూటింగ్ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నారు. ఈ సినిమాలో మొత్తం 6 యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండగా, 20 నిమిషాల నిడివి గల ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను పవన్ కళ్యాణ్ స్వయంగా రూపొందించారు. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ స్టూడియోలో 61 రోజుల పాటు చిత్రీకరించారు. దీని కోసం పవన్ ఎంతో కష్టపడ్డారని, అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారని దర్శకుడు తెలిపారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుందని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దిగ్గజం ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం మరియు నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com